ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

# నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03 సంచిక -26 పేజీలు - 08 వెల - 04/- శనివారం 10 జనవరి 2026



# ‘మీ భూమి మీ హక్కు’

## రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ ప్రారంభం

**మన భూములపై ఆయన ఫొటో ఏంటి?: రాయవరంలో సీఎం చంద్రబాబు ఫైర్**

**తూర్పు గోదావరి జిల్లా రాయవరంలో సీఎం చంద్రబాబు పర్యటన**

**ఇకపై భూ రికార్డులను ట్యాంపర్ చేయకుండా బ్లాక్‌చెయిన్ టెక్నాలజీతో భద్రత**

కాకినాడ**జనవరి 09ఆంధ్ర ప్రగతి**

గత ప్రభుత్వ అస్తవ్యస్త, వివాదాస్పద భూ విధానాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజల భూములను కాజేసేందుకే ప్రమాదకరమైన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను తీసుకొచ్చారని, అందుకే తాను అధికారంలోకి వచ్చిన వెంటనే దానిని రద్దు చేస్తూ రెండో సంతకం పెట్టానని స్పష్టం చేశారు. శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా మండపేట నియోజకవర్గంలోని రాయవరంలో ‘మీ భూమి – మీ హక్కు’ కార్యక్రమాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు.

మిగతా 2లో...



# జల వివాదాలను మనమే పరిష్కరించుకుందాం

**చంద్రబాబుకు విజ్ఞప్తి చేస్తున్నా : వివాదాలపై రేవంత్ రెడ్డి కీలక సూచన**

**రాజకీయాలకు అతీతంగా నీళ్ల సమస్యను పరిష్కరించుకుందామని వ్యాఖ్య**

**కోర్టుల్లో కాకుండా మన సమస్యలు మనమే పరిష్కరించుకుందామని స్పష్టీకరణ**

**ఏపీ ఒక అడుగు వేస్తే, తెలంగాణ పది అడుగులు వేస్తుందన్న రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్ జనవరి 09ఆంధ్ర ప్రగతి**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక సూచన చేశారు. జల వివాదాలను పరస్పరం కూర్చుని మాట్లాడుకోవడం ద్వారా పరిష్కరించుకుందామని అన్నారు. రంగారెడ్డి జిల్లా రావిర్యాలలో సుజెన్ మెడికేర్ ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ, రెండు రాష్ట్రాల మధ్య వివాదాలు ఉండకూడదనే కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిందని గుర్తు చేశారు. రాజకీయాలకు అతీతంగా నీటి సమస్యను పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. మిగతా 2లో...

# ఈ నెల 28 నుంచి కేంద్ర బడ్జెట్ సమావేశాలు

**రెండు విడతలుగా ఏప్రిల్ 2 వరకు పార్లమెంటు సమావేశాలు కొనసాగింపు**

**అరుదుగా ఆదివారం రోజున ఫిబ్రవరి 1న బడ్జెట్ సమర్పణ**

**రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగంతో సభ ప్రారంభం**

**షెడ్యూల్ వెల్లడించిన కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు**

**ఢిల్లీ జనవరి 09:**

2026 సంవత్సరానికి సంబంధించిన పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల షెడ్యూల్ ఖరారైంది. జనవరి 28 నుంచి ఈ సమావేశాలు జరగనున్నాయని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు శుక్రవారం అధికారికంగా ప్రకటించారు. ఈసారి కేంద్ర బడ్జెట్‌ను ఆదివారం రోజున ప్రవేశపెట్టే అవకాశం ఉండటం ఈ సమావేశాల ప్రత్యేకతగా నిలవనుంది. రెండు విడతలుగా సాగే ఈ సమావేశాలు ఏప్రిల్ 2 వరకు కొనసాగుతాయి. మిగతా 2లో...



# ఆరోగ్యాంధ్రప్రదేశ్ నిర్మాణంలో భాగస్వామ్యం కండి

**మెరుగైన ఆరోగ్య సేవలు, నాణ్యమైన వైద్యం మా లక్ష్యం**

**వైద్యారోగ్య శాఖ అధికారుల వర్క్‌షాపులో మంత్రి సత్యకుమార్**



విజయవాడ,**జనవరి 09ఆంధ్ర ప్రగతి**

ఆరోగ్యాంధ్రప్రదేశ్ నిర్మాణంలో అందరూ భాగస్వామ్యం కావాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఏపీ వ్యాప్తంగా అన్ని ఆస్పత్రుల సూపరింటెండెంట్‌లు, బోధనాస్పత్రుల ప్రిన్సిపాళ్లతో మంత్రి.. ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. మిగతా 2లో...

# రచ్చకెక్కిన బెంగాల్ రాజకీయం

**ఇడి చర్యలపై మమతా నిరసన ప్రదర్శన**

**మమతా బెనర్జీ తీరుపై మండిపడ్డ బిజెపి**

**విచారణకు అడ్డుపడడంపై సుప్రీంలో ఇడి పిటిషన్**

కోల్‌కతా**జనవరి 09ఆంధ్ర ప్రగతి**ఇండియన్ పొలిటికల్ యాక్షన్ కమిటీ , దాని సహ వ్యవస్థాపకుడు ప్రతీక్ జైన్‌పై ఈడీ దాడుల వ్యవహారం రచ్చకెక్కింది. దీనిపై శుక్రవారం నాడు కేంద్రం, పశ్చిమబెంగాల్ ప్రభుత్వం మధ్య ఘర్షణ మరింత తీవ్రమైంది. 2లో...



# గెస్ట్ హౌజ్‌కోసం స్థలం కేటాయింపు తప్పా?

**భాను ప్రకాశ్ రెడ్డి వ్యతిరేకించడం బాధ కలిగించింది**

**బాబుకు ఇబ్బంది రాకూడదనే టిటిడి బోర్డుకు రాజీనామ చేశ**

**టిటిడి సభ్యుడు జంగా కృష్ణమూర్తి వెల్లడి**

విజయవాడ,**జనవరి 09ఆంధ్ర ప్రగతి**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుకి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) బోర్డు సభ్యత్వానికి తాను రాజీనామా చేశానని జంగా కృష్ణమూర్తి స్పష్టం చేశారు. శుక్రవారం విజయవాడలో జంగా కృష్ణమూర్తి విలేకర్లతో మాట్లాడుతూ.. తన రాజీనామాపై వివరణ ఇచ్చారుమిగతా 2లో...



# టెట్ ఫలితాలు వచ్చేశాయ్!

**ఏపీ టెట్ 2025 ఫలితాలు అధికారికంగా విడుదల**

**మొత్తం 39.27 శాతం మంది అభ్యర్థులు ఉత్తీర్ణులు**

**పరీక్షకు హాజరైన వారిలో 97,560 మంది అర్హత**




విజయవాడ,**జనవరి 09ఆంధ్ర ప్రగతి**

ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (ఏపీ టెట్-2025) ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. ఈ పరీక్షలో మొత్తం 39.27 శాతం మంది అభ్యర్థులు మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. గత ఏడాది డిసెంబర్ 10 నుంచి 21 వరకు ఈ పరీక్షలను నిర్వహించిన సంగతి తెలిసిందే. మిగతా 2లో...




# ‘పున మార్గం’ ఎఫెక్ట్...

**భద్రతా బలగాల ముందు లొంగిపోయిన 63 మంది మావోయిస్టులు**

**వీరిలో రూ.1.19 కోట్ల రివార్డులు ఉన్న 36 మంది**

**లొంగిపోయిన వారిలో కీలక డివిజనల్ కమిటీ సభ్యులు**

బస్తర్ **జనవరి 09ఆంధ్ర ప్రగతి**

ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలో మావోయిస్టు ఉద్యమానికి భారీ ఎదురుదెబ్బ తగిలింది. శుక్రవారం దంతెవాడలో జరిగిన ఒక కార్యక్రమంలో 18 మంది మహిళలు సహా మొత్తం 63 మంది మావోయిస్టులు భద్రతా బలగాల ముందు లొంగిపోయారు. వీరిలో 36 మందిపై మొత్తం రూ.1.19 కోట్ల రివార్డు ఉండటం గమనార్హం. మిగతా 2లో...

# విద్వేషాలు రేపితే ఎరిపారేస్తా

**అవాస్తవాలు వైరల్ చేస్తూ చూస్తూ ఊరుకోను**

**శాంతిభద్రతల విషయంలో పోలీసులు కఠినంగా ఉండాలి**

**పట్టణ పారిశుద్ధ్యంపై మున్సిపల్ సిబ్బంది శ్రద్ధ పెట్టాలి**

**పీఠికాపుర సంక్రాంతి మహోత్సవాలు ప్రారంభించిన పవన్ కళ్యాణ్**

**సంక్రాంతి అందరి పండగగా జరుపుకోవాలని పిలుపు**



కాకినాడ,**జనవరి 09ఆంధ్ర ప్రగతి**

పపిఠాపురంలో ఏ చిన్న సంఘటన జరిగినా వైరల్ చేస్తున్నారని ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. పిఠాపురంలో కొబ్బరాకు, తాటాకు పడినా ఏదో జరిగిందని ప్రచారం చేస్తున్నారని అసహనం వ్యక్తంచేశారు. అవాస్తవాలను వైరల్ చేయడం మానుకోవాలని హితవు పలికారు. పిఠాపురంలో నిర్వహించిన ’పీఠికాపుర సంక్రాంతి మహోత్సవాలు’ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మిగతా 2లో...

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ

(మొదటి పేజి తరువాయి)
ఈ సందర్భంగా కొందరు రైతులకు రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేసి, వాటిపై ఉన్న క్యూఆర్ కోడ్, సాంకేతికతను స్వయంగా పరిశీలించారు.అనంతరం ఏర్పాటు చేసిన ప్రజావేదిక నుంచి ప్రజలను ఉద్దేశించి చంద్రబాబు ప్రసంగించారు. “మన పూర్వీకులు కష్టపడి సంపాదించిన, మన స్వార్జితమైన భూమిపై ఆయన (జగన్) ఫొటో ఏమిటి? సరిహద్దు రాళ్లపై ఆయన ముద్రలు వేయడమేంటి? అని గతంలోనే ప్రశ్నించాను. ఇది అహంకారానికి నిదర్శనం” అని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకపోయుంటే, ల్యాండ్ టైటిలింగ్ చట్టం పేరుతో ప్రజల భూములన్నీ తమకు నచ్చిన వారికి కట్టబెట్టేందుకు కుట్ర పన్నారని ఆరోపించారు. “నిన్నామొన్న రాజకీయాల్లోకి వచ్చిన వ్యక్తులు చాలా ప్రమాదకరమైన ఆలోచన చేశారు. మీ భూముల వివరాలన్నీ వారి అనుచరులు అమెరికాలో పెట్టుకున్నారు. ప్రజలు సరైన సమయంలో బ్యాలెట్ ద్వారా తగిన బుద్ధి చెప్పారు” అని అన్నారు.భూమి అంటే రైతుకు కేవలం ఆస్తి కాదని, అదొక విశ్వాసం, కుటుంబంతో పెనవేసుకుపోయిన సెంటిమెంట్ అని చంద్రబాబు పేర్కొన్నారు. కరోనా సమయంలో అందరూ సెలవులు తీసుకున్నా, దేశానికి అన్నం పెట్టే రైతుకు మాత్రం సెలవు లేదని గుర్తుచేశారు. గత పాలకుల తీరు వల్ల తాను ఎక్కడికి వెళ్లినా భూ వివాదాలకు సంబంధించిన పిటిషన్లే ఎక్కువగా వస్తున్నాయని, వాటన్నింటినీ పరిష్కరించాలనే సంకల్పంతోనే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టానని తెలిపారు. స్వర్గీయ ఎన్టీఆర్ కరణం, మునసబు వ్యవస్థను రద్దు చేసి రైతులకు మేలు చేస్తే, తెలంగాణలో పండుగ చేసుకున్నారని, కానీ మన రాష్ట్రంలో కొందరు దానిని వ్యతిరేకించారని గుర్తుచేశారు.ఇకపై భూ వివాదాలకు తావులేకుండా పూర్తి పారదర్శకతతో రికార్డులను పక్కాగా నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. “తహసీల్దారు కార్యాలయంలో కాదు, గ్రామసభలు నిర్వహించి, ప్రజల మధ్యనే పాస్‌పుస్తకాలు పంపిణీ చేయాలని ఆదేశించాను. పద్ధతి ప్రకారం రీసర్వే చేయించి, రికార్డులను ట్యాంపర్ చేయడం అసాధ్యమయ్యేలా బ్లాక్‌చెయిన్ టెక్నాలజీని వినియోగిస్తున్నాం. పాస్‌బుక్‌పై ఉండే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే చాలు, మీ భూమి వివరాలన్నీ క్షణాల్లో కనిపిస్తాయి” అని వివరించారు. ఈ రాజముద్రతో కూడిన పాస్‌పుస్తకాలను రైతులకు, భూ యజమానులకు సత్వరమే అందించేలా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

# ఆరోగ్యాంధ్రప్రదేశ్ నిర్మాణంలో భాగస్వామ్యం కండి

(మొదటి పేజి తరువాయి)
ఈ సందర్భంగా అధికారులకు కీలక సూచనలు చేశారు. మెరుగైన ఆరోగ్య సేవలు, నాణ్యమైన వైద్య, విద్య అందించాలని దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో వైద్య రంగంలో ప్రతికూలతలు ఎదుర్కొంటూనే సేవలందించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఓపీ, ఐపీ, ఇతర సేవలు గతంతో పోలిస్తే 12శాతం పెరిగాయని చెప్పుకొచ్చారు. రోగులు అధిక శాతం ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చేలా చేయగలిగామని వ్యాఖ్యానించారు. డాక్టర్లు, మందులు, సిబ్బంది అందుబాటులో ఉంటున్నారని తెలిపారు. కింది స్థాయిలో 28శాతం అవినీతి ఉందని తెలుస్తోందన్నారు. పారిశుధ్యంలో ఇంకా మార్పు రావాల్సి ఉందని తెలిపారు. బోధనాస్పత్రుల్లో అనుమతించిన బెడ్లు 500 వరకూ ఉంటున్నాయని వివరించారు. ఆస్పత్రుల్లో రోగులకు సరిపడా మంచాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఆస్పత్రుల్లో మార్పులు రావాల్సి ఉందని చెప్పుకొచ్చారు. వాట్సాప్ గవర్నెన్స్‌లో వైద్య సేవలు అందుబాటులోకి రావాల్సి ఉందని తెలిపారు. ఎబిహెచ్ఎ యాప్ ఐడీ జనరేట్ చేసేలా చూడాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచించారు. చాలాచోట్ల ఎఫ్ఎంఓలు లేకపోవడం ప్రధాన అంశంగా కనిపిస్తోందని అన్నారు. సూపరింటెండెంట్‌లు, అడ్మినిస్ట్రేషన్ మధ్యలో సరైన కోఆర్డినేషన్ ఉండట్లేదని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. అనంతపురంలోని ఆస్పత్రుల్లో చాలా అంశాల్లో లోపాలు తన దృష్టికి వస్తుంటాయని వెల్లడించారు. క్షేత్రస్థాయిలో సూపరింటెండెంట్‌లు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రిడిక్టివ్, ప్రివెంటివ్ వెల్‌నెస్ వైపు ప్రభుత్వ వైద్యులు అందరూ ఆలోచించాలని కోరారు. ఆరు నెలలు సెకండరీ ఆస్పత్రుల్లో, ఆరు నెలలు బోధన ఆసుపత్రుల్లో పని చేయాలని ఆదేశాలు జారీ చేశారు. సొంతూళ్లలో పని చేయాలని చూసేవారు అటెండెన్స్ తప్పించుకోవాలని చూస్తున్నారని అన్నారు. కొత్త బోధనాస్పత్రులకు ఇంకా నిర్మాణమే మొదలవలేదని చెప్పుకొచ్చారు. ÷ఎఓ÷ాని సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్సీగా చేయాలంటే రూ.1000 కోట్లు కావాలని అన్నారు. గత జగన్ ప్రభుత్వంలో అభివృద్ధి పనులు ఏమీ చేయలేదని.. ఇవాళ అన్నీ కావాలంటే కొంత సమయం పడుతుందని తెలిపారు. 2047 నాటికి వికసిత భారత్ సాధించాలంటే ప్రధాన భూమిక డాక్టర్లదేనని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. మూడు నెలల్లో ఆస్పత్రుల పరిస్థితి మారాల్సి ఉందని ఏపీ వైద్య ఆరోగ్య శాఖ సెక్రెటరీ సౌరభ్ గౌర్ సూచించారు. ఆరు నెలల్లో అత్యుత్తమ ఆస్పత్రులుగా మారాలని పేర్కొన్నారు. సంజీవనిలో పౌరులకు ఇచ్చే సేవలు తెలియాలని చెప్పుకొచ్చారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రులకు లక్షకు పైగా రోగులు వస్తారని అన్నారు. ఆక్సిజన్ సప్లై, ఇతర సదుపాయాలు ప్రైవేటు సెక్టార్ నుంచి వినియోగిస్తున్నామని తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవ విషయంలోనూ ప్రైవేటు ఆస్పత్రులు పని చేస్తున్నాయని వివరించారు. ఏపీ వ్యాప్తంగా మొత్తం ఆస్పత్రుల్లో ఇప్పటి వరకూ.. 144శాతం ఔట్ పేషెంట్ సేవలు అందించామని చెప్పారు. ఈ నెలాఖరులోగా అన్ని రకాల స్థాయిల్లోని ఉద్యోగులకు ప్రొమోషన్లు కల్పిస్తామని చెప్పుకొచ్చారు. 140శాతం సర్జరీలు మన ప్రభుత్వ ఆస్పత్రుల్లో జరిగాయని వివరించారు. పిల్లల డెలివరీలు అన్ని ఆస్పత్రుల్లో పెంచాల్సి ఉందని తెలిపారు. ఎబిహెచ్ఎ యాప్ పూర్తి స్థాయిలో డౌన్ లోడ్ అయ్యేలా చూడాలని సూచించారు. ఇప్పటి వరకూ 96శాతం మంది యాప్‌ను డౌన్‌లోడ్ చేశారని వెల్లడించారు. మరమ్మతులు చేయాల్సిన పరికరాలను వెంటనే చేయించాలని చెప్పుకొచ్చారు. నెల రోజుల్లో అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని అన్నారు. పారిశుధ్యం, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్, వీల్ చైర్లు, స్ట్రెచర్లు, పడకలు.. అన్నీ మారాలని సౌరభ్ గౌర్ సూచించారు.

# విద్వేషాలు రేపితే ఎరిపారేస్తా







(మొదటి పేజి తరువాయి)
పులివెందులలో సొంత బాబాయ్‌ని చంపినా అది వార్త కాదు.. పిఠాపురంలో స్కూల్ పిల్లలు కొట్టుకున్నా అది పెద్ద వార్త అవుతుంది. పిఠాపురం వచ్చి గొడవలు చేద్దామనుకుంటే ఇక్కడ కూర్చొని ఏరివేస్తాను. గత ప్రభుత్వంలో బూతులు తిట్టడం, కేసులు పెట్టడం చేశారు. పిఠాపురంలో మళ్లీ అలాంటివి తెచ్చే ప్రయత్నం జరుగుతోంది. శాంతి భద్రతల విషయంలో పోలీసులు కఠినంగా వ్యవహరించాలి. నా మాటలు మెత్తగా.. చేతలు గట్టిగా ఉంటాయి. నన్ను అన్నా.. పార్టీని అన్నా భరిస్తా. ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టించే వారిని మాత్రం క్షమించనని ఘాటుగా హెచ్చరించారు. అంతకుముందు పలు స్టాళ్లను మంత్రులు నారాయణ, నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్‌తో కలిసి ఆయన సందర్శించారు. పిఠాపురం సంక్రాంతి ఉత్సవాలకు చిరునామా కావాలన్నారు ఈ పండుగ అన్ని మతాలు జరుపుకొనే స్థాయికి ఎదగాలి. తెలంగాణకు ఆంధ్రా ప్రాంత ప్రజల ప్రేమను తీసుకెళ్లాలి. అక్కడి సోదరీమణులను సంక్రాంతికి ఆహ్వానించి.. వారికి గోదావరి జిల్లాల ఆతిథ్యాన్ని రుచి చూపాలి. సంక్రాంతి అంటే కోడిపందేలు, జూదాలు మాత్రమే కాదు. ఈ సరదాలను నేను కాదనడం లేదు.. చేసేవాళ్లు చేసుకోండి. కానీ వాటికే పరిమితం కాకూడదన్నారు. పిఠాపురం.. దేశానికి చాలా కీలకమైన శక్తిపీఠం. శ్రీపాద శ్రీవల్లభుడు వెలసిన నేల ఇది. ఇక్కడి నుంచి నేను పోటీ చేయడం భగవంతుడి సంకల్పం. పిఠాపురం అభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నాం. నన్ను బలోపేతం చేస్తే మరింతగా పనిచేస్తా. అధికారం ఉన్నా లేకపోయినా ఆఖరిశ్వాస వరకు ఇక్కడి ప్రజల కోసం పనిచేస్తాను. సీఎం చంద్రబాబు అనుభవం రాష్ట్రానికి చాలా అవసరం. కూటమి నేతలు పొత్తులను బలహీనం చేసే ప్రయత్నం చేయొద్దు. ప్రజలను ఎలా కాపాడాలి అనే అంశంపై నాకు, చంద్రబాబుకు పూర్తి అవగాహన ఉందని పవన్ అన్నారు.డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. తన సొంత నియోజకవర్గం కాకినాడ జిల్లా పిఠాపురంలో పర్యటిస్తున్నారు.. అయితే, స్థానిక అధికారుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు పవన్.. పిఠాపురం మున్సిపల్ కమిషనర్‌తో పాటు డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, పిఠాపురం కమిషనర్ వ్యవహారశైలిని ఆయన తప్పుబట్టారు. కాలనీల్లో పేరుకుపోయిన చెత్త, అపరిశుభ్ర పరిస్థితులను చూసి పవన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలనీలు ఇంత చెత్తగా ఉంటే అక్కడి ప్రజల జీవన ప్రమాణాలు ఎలా ఉంటాయి? నేను అయితే ఇలాంటి చోట ఒక్క రోజు కూడా ఉండలేను. అసలు నేను చీపురు పట్టి రోడ్లు తుడవాలా? అంటూ అధికారులను నిలదీశారు. ఇక, పిఠాపురంలో పారిశుధ్య నిర్వహణ విఫలమవుతున్న నేపథ్యంలో.. 'గుడ్ మార్నింగ్ పిఠాపురం' కార్యక్రమాన్ని కూడా తానే స్వయంగా నిర్వహించాలా? అని పవన్ తీవ్రంగా ప్రశ్నించారు. ప్రజలకు కనీస సదుపాయాలు అందించడంలో మున్సిపల్ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. పిఠాపురం అభివృద్ధి కోసం పాడా పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ప్రకటించినా, దాని అమలు విషయంలో వేగం లేకపోతే ప్రయోజనం ఏముంటుందని ప్రశ్నించారు. అవసరమైతే రాజకీయ–పరమైన అడ్మినిస్ట్రేషన్ నిర్ణయాలు తీసుకోలేరా? అభివృద్ధి కోసం ప్రభుత్వం గట్టి అడుగులు వేయొద్దా? అని అధికార పార్టీ నేతలను, యంత్రాంగాన్ని నిలదీశారు.కాలనీల్లో నడుచుకుంటూ సమస్యలు తెలుసుకున్నారు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. కేవలం సమీక్షలకే పరిమితం కాకుండా, పవన్ కల్యాణ్ పిఠాపురం కాలనీల్లో నడుచుకుంటూ వెళ్లి స్థానికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ, చెత్త నిర్వహణ, మౌలిక వసతుల కొరతపై ప్రజలు చెప్పిన అంశాలను ఆయన నోట్ చేసుకున్నారు. అయితే, పిఠాపురం పారిశుధ్య వ్యవస్థను వెంటనే మెరుగుపర్చాలని, అధికార యంత్రాంగం ప్రజల అవసరాలకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. నిర్లక్ష్యం కొనసాగితే ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతుందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హెచ్చరించారు.

# గెస్ట్ హౌజ్‌కోసం స్థలం కేటాయింపు తప్పా?

(మొదటి పేజి తరువాయి)
2005లో తాను టీటీడీ సభ్యుడిగా ఉన్న సమయంలో తిరుమలలో గెస్ట్ హౌస్ నిర్మాణం కోసం భూమి ఇవ్వాలని కోరినట్లు జంగా తెలిపారు.

తన విజ్ఞప్తి మేరకు భూమిని ఇచ్చారని జంగా కృష్ణమూర్తి తెలిపారు. కానీ ఆ సమయంలో ఆర్థిక వెసులుబాటు లేక గెస్ట్ హౌస్ నిర్మించ లేకపోయానని తెలిపారు. మళ్లీ తనకు స్థలం కేటాయించాలని తాజాగా టీటీడీని కోరారని పేర్కొన్నారు. అందుకు టీటీడీ బోర్డు తీర్మానం చేసి ముఖ్యమంత్రికి పంపిందని చెప్పుకొచ్చారు. ఈ భూమిని తనకు కేటాయించాలా, వద్దా? అనేది ప్రభుత్వం నిర్ణయమన్నారు. దీనిపై పరిపాలన పరంగా నిర్ణయం చేయాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. అయితే ఈ తీర్మానంపై టీటీడీ బోర్డులో సభ్యుడు, బీజేపీ నేత భానుప్రకాశ్ ఒక్కరే వ్యతిరేకించారని పేర్కొన్నారు. తనకు స్థలం కేటాయించడం ద్వారా బోర్డు తప్పు చేసిందనే ఆలోచన రాకూడదనే తాను రాజీనామా చేస్తున్నట్లు ఈ సందర్భంగా జంగా కృష్ణమూర్తి ప్రకటించారు. టీటీడీ బోర్డుకు స్థలం కేటాయించడానికి హక్కు లేదా? అంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తనకు కేటాయించి.. రద్దు చేసిన భూమిని తాను చైర్మన్‌గా ఉన్న ఓం శ్రీ నమో వెంకటేశ్వర గ్లోబల్ ట్రస్ట్‌కు మళ్లీ కేటాయించాలని టీటీడీని కోరానంటూ జంగా కృష్ణమూర్తి ఈ సందర్భంగా వివరణ ఇచ్చారు. ఇది ఎలా తప్పు అవుతుందంటూ ఆయన సందేహం వ్యక్తం చేశారు. తాను ఈ నిర్ణయం తీసుకోకుంటే ప్రభుత్వానికి, టీటీడీ బోర్డుకు ఇబ్బంది వస్తుందనే ఈ పదవికి రాజీనామా చేసినట్లు చెప్పుకొచ్చారు. ముచ్చటగా మూడోసారి శ్రీవారి సేవ చేసుకోవడానికి సీఎం చంద్రబాబు తనకు అవకాశం కల్పించారని వెల్లడించారు.

# ‘పున మార్గం’ ఎఫెక్ట్...

(మొదటి పేజి తరువాయి)
దంతెవాడ జిల్లా రిజర్వ్ గార్డ్ (డీఆర్జీ) కార్యాలయంలో ఈ లొంగుబాటు కార్యక్రమం జరిగింది. హింసను వీడి జనజీవన స్రవంతిలో కలిసేలా మావోయిస్టులను ప్రోత్సహించేందుకు దంతెవాడ పోలీసులు చేపట్టిన ‘పున మర్గం’ (పునరావాసం – పునరుజ్జీవనం) ప్రచారమే ఈ భారీ లొంగుబాటుకు కారణమని అధికారులు తెలిపారు. డీఆర్జీ, బస్తర్ ఫైటర్స్, సీఆర్పీఎఫ్ బలగాలు వీరిని లొంగిపోయేలా చేయడంలో కీలక పాత్ర పోషించాయి.లొంగిపోయిన వారిలో దర్భా డివిజన్, దక్షిణ బస్తర్, పశ్చిమ బస్తర్, మాడ్ డివిజన్‌లతో పాటు ఒడిశాలో పనిచేసిన వారు కూడా ఉన్నారు. వీరిలో డివిజనల్ కమిటీ సభ్యులు (డీవీసీఎమ్) మోహన్ కడ్తీ, సుమిత్రా కడ్తీ, పీపుల్స్ పార్టీ కమిటీ సభ్యురాలు (పీపీసీఎమ్) హంగీ వంటి కీలక నేతలు ఉన్నారు. వీరిపై గతంలో అనేక దాడులు, హత్యలు, ఐఈడీ పేలుళ్లు, ఆస్తుల ధ్వంసం వంటి కేసులు నమోదై ఉన్నాయి.ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ నక్సల్ పునరావాస విధానం ప్రకారం, లొంగిపోయిన వారికి రూ. 50,000 తక్షణ సహాయంతో పాటు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ, వ్యవసాయ భూమి, ఇతర సౌకర్యాలు కల్పిస్తామని అధికారులు వివరించారు. ఈ లొంగుబాటు బస్తర్‌ను నక్సల్ రహిత ప్రాంతంగా మార్చే ప్రయత్నాల్లో ఒక పెద్ద విజయమని బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ పట్టిలింగం పేర్కొన్నారు.

# జల వివాదాలను మనమే పరిష్కరించుకుందాం

(మొదటి పేజి తరువాయి)
కోర్టుల ద్వారా కాకుండా మన సమస్యలను మనమే పరిష్కరించుకుందామని విజ్ఞప్తి చేశారు. జల వివాదం విషయంలో రాజకీయ ప్రయోజనం పొందాలని తమ ప్రభుత్వం ప్రయత్నించడం లేదని స్పష్టం చేశారు. పంచాయితీ కావాలా, నీళ్లు కావాలా అని నన్ను అడిగితే తెలంగాణకు నీళ్లు కావాలని చెబుతానని, అదే సమయంలో వివాదాలు కావాలా, పరిష్కారం కావాలా అని అడిగితే పరిష్కారం కావాలని స్పష్టంగా చెబుతానని ఆయన అన్నారు.ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఈ వేదిక ద్వారా విజ్ఞప్తి చేస్తున్నానని, కృష్ణా నదిపై ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ప్రాజెక్టుల అనుమతులకు అడ్డంకులు సృష్టించవద్దని కోరారు. అలా అడ్డంకులు కలిగిస్తే కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదని, దీనివల్ల రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తాము వివాదాలు కోరుకోవడం లేదని, పరిష్కారం మాత్రమే కోరుకుంటున్నామని ఆయన స్పష్టం చేశారు. తమకు కావలసింది రాజకీయ ప్రయోజనాలు కాదని, ప్రజల ప్రయోజనాలని అన్నారు.తెలంగాణకు పోర్టు కనెక్టివిటీ ఉండాలంటే పక్క రాష్ట్రం సహకారం ఉండాల్సిందే అన్నారు. రెండు రాష్ట్రాలు పరస్పరం సహకరించుకుంటేనే సమస్యలు పరిష్కారమవుతాయని వ్యాఖ్యానించారు. జల వివాదాల విషయంలో ఆంధ్రప్రదేశ్ ఒక్క అడుగు ముందుకు వేస్తే తాము 10 అడుగులు ముందుకు వేస్తామని ఆయన అన్నారు. ఇంకా ఆయన మాట్లాడుతూ, పెట్టుబడులకు తెలంగాణ అనుకూలమైన రాష్ట్రమని అన్నారు. పెద్ద పెద్ద కంపెనీలకు మన దేశానికి చెందిన వారే సీఈవోలుగా ఉన్నారని ఆయన తెలిపారు.

## ఈ నెల 28 నుంచి కేంద్ర బడ్జెట్ సమావేశాలు

(మొదటి పేజి తరువాయి)
కేంద్ర ప్రభుత్వ సిఫార్సు మేరకు, పార్లమెంట్ ఉభయ సభలను సమావేశపరచడానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్ర వేశారని మంత్రి కిరణ్ రిజిజు తన ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. “2026 బడ్జెట్ సమావేశాలు జనవరి 28న ప్రారంభమై ఏప్రిల్ 2 వరకు జరుగుతాయి. తొలి విడత సమావేశాలు ఫిబ్రవరి 13తో ముగుస్తాయి. అనంతరం మార్చి 9న సభ తిరిగి సమావేశమవుతుంది. అర్థవంతమైన చర్చలకు, ప్రజలు కేంద్రంగా సాగే పాలనకు ఈ సమావేశాలు అత్యంత కీలకం” అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.నివేదికల ప్రకారం, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పూర్తిస్థాయి బడ్జెట్‌ను లోక్‌సభలో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఫిబ్రవరి 1 ఆదివారం కావడం గమనార్హం. పార్లమెంట్ చరిత్రలో ఆదివారం రోజున బడ్జెట్ ప్రవేశపెట్టడం చాలా అరుదు. దీనికోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సి ఉంటుందని తెలుస్తోంది. ఇక బడ్జెట్‌కు ముందు, దేశ ఆర్థిక వ్యవస్థ పనితీరును సమీక్షించే ఆర్థిక సర్వేను జనవరి 29 లేదా 30న పార్లమెంట్ ఉభయ సభల ముందు ఉంచనున్నారు.ఈ బడ్జెట్ సమావేశాలను రెండు దశల్లో నిర్వహించనున్నారు. తొలి విడత జనవరి 28 నుంచి ఫిబ్రవరి 13 వరకు జరుగుతుంది. ఆ తర్వాత సభకు విరామం ఉంటుంది. ఈ విరామ సమయంలో వివిధ మంత్రిత్వ శాఖలకు చెందిన పార్లమెంటరీ స్థాయీ సంఘాలు బడ్జెట్ పద్దులు, వివిధ పథకాలకు కేటాయింపులపై లోతైన సమీక్ష జరుపుతాయి. అనంతరం మార్చి 9న రెండో విడత సమావేశాలు ప్రారంభమై ఏప్రిల్ 2 వరకు కొనసాగుతాయి. ఈ దశలో స్థాయీ సంఘాల నివేదికలపై చర్చించి, తుది ఆమోదం తెలుపుతారు.సంప్రదాయం ప్రకారం, సమావేశాల మొదటి రోజైన జనవరి 28న పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగిస్తారు. ఈ ప్రసంగంలో ప్రభుత్వ విధానాలు, ప్రాధాన్యతలు, భవిష్యత్ ప్రణాళికలను ఆమె వివరిస్తారు. ఆర్థిక వృద్ధి, ద్రవ్యలోటు నియంత్రణ, మౌలిక సదుపాయాలు, ఉపాధి కల్పన వంటి కీలక అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించిన నేపథ్యంలో ఈ సమావేశాలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. పన్నులు, ప్రభుత్వ వ్యయం, విధానపరమైన సంస్కరణలపై అధికార, విపక్ష సభ్యుల మధ్య వాడివేడి చర్చలు జరిగే అవకాశం ఉంది. రాష్ట్రపతి ఆమోదంతో సమావేశాల నిర్వహణకు అధికారికంగా ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి.

# రచ్చకెక్కిన బెంగాల్ రాజకీయం

(మొదటి పేజి తరువాయి)



అవినీతిలో కూరుకుపోయారంటూ తనపై బీజేపీ చేస్తున్న ఆరోపణలు, ఈడీ చర్యలపై ముఖ్యమంత్రి మమతాబెనర్జీ.. కోల్‌కతా రోడ్లపైకి వచ్చి భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. మరోవైపు ఈడీ సైతం కోల్‌కతా హైకోర్టు విచారణపై సుప్రీంకోర్టును ఆశ్రయించింది.ప్యాక్‌పై ఈడీ దాడులకు సంబంధించి దాఖలైన పలు పిటిషన్లపై కోల్‌కతా హైకోర్టు జస్టిస్ సువ్ర ఘోష్ విచారణ చేపట్టినప్పటికీ భారీగా జనం హాజరుకావడంతో ఆయన కోర్టు రూమ్‌ను విడిచిపెట్టి వెళ్లిపోయారు. గత వారంరోజులుగా కోర్టుకు సెలవులు ఉండగా.. ఈ అంశంపై వచ్చే బుధవారం నాడు తిరిగి విచారణ చేపట్టనున్నారు. కోల్‌కతా హైకోర్టులో కేసు విచారణ వాయిదా పడటంతో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్‌ను ఈడీ శుక్రవారం నాడు ఆశ్రయించింది. తక్షణ విచారణ కోసం ధర్మాసనం ఏర్పాటు చేయాలని కోరింది. కాగా, హైకోర్టులో శుక్రవారం విచారణ సందర్భంగా ఈడీ తమ వాదన వినిపిస్తూ, ఐప్యాక్ కార్యాలయం, జైన్ నివాసంలో తాము సోదాలు నిర్వహిస్తుండగా అధికారులతో అడ్డగించడం ద్వారా ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించింది. దీనిపై జైన్, తృణమూల్ కాంగ్రెస్ కౌంటర్ పిటిషన్ దాఖలు చేసింది. తృణమూల్ కాంగ్రెస్ ఎన్నికల వ్యూహానికి సంబంధించిన డాక్యుమెంట్లను సీజ్ చేయాలని ఈడీ ప్రయత్నించిందని ఆ పిటిషన్‌లో ఆరోపించారు. ఒకవైపు కోర్టు విచారణ జరుగుతుండగా మరోవైపు ఈడీ దాడులకు నిరసనగా ముఖ్యమంత్రి మమతాబెనర్జీ జాదవ్‌పూర్ నుంచి హజ్రా క్రాసింగ్ వరకూ 5 కిలోమీటర్ల మేరకు పాదయాత్ర నిర్వహించారు. పెద్దఎత్తున కార్యకర్తలు, పార్టీ నేతలు ఇందులో పాల్గొన్నారు. ఏం చేసైనా సరే పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో గెలవాలని బీజేపీ ప్రయత్నాలు చేస్తోందని మమతా బెనర్జీ, తృణమూల్ నేతలు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. అయితే ఈ ఆరోపణలను బీజేపీ తోసిపుచ్చింది. టీఎంసీ చీఫ్ అవినీతి ఊబిలో కూరుకుపోయారని, ఈడీ అధికారులను బెదిరిస్తున్నారని బీజేపీ సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్ ఆరోపించారు. మమతా చర్యల వెనుక అనేక అనుమానాలు ఉన్నాయని.. తనను, తమ పార్టీని చిక్కుల్లోకి నెట్టే కీలకమైన సమాచారాన్ని తొలగించేందుకు ఆమె ప్రయత్నిస్తున్నారని రవిశంకర్ ప్రసాద్ విమర్శించారు.

## టెట్ ఫలితాలు వచ్చేశాయ్!

(మొదటి పేజి తరువాయి)ఏపీ టెట్ కన్వీనర్ వెంకట కృష్ణారెడ్డి ఫలితాల వివరాలను మీడియాకు వెల్లడించారు. టెట్‌కు మొత్తం 2,71,692 మంది దరఖాస్తు చేసుకోగా, 2,48,427 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 97,560 మంది అర్హత సాధించినట్లు ఆయన తెలిపారు. ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల్లో ఉత్తీర్ణత శాతం కాస్త మెరుగ్గా నమోదైంది. పరీక్షకు హాజరైన 31,886 మంది ఇన్‌సర్వీస్ టీచర్లలో 15,239 మంది (47.82 శాతం) పాసయ్యారు.ప్రాథమిక కీ విడుదల తర్వాత అభ్యర్థుల నుంచి అందిన అభ్యంతరాలను నిపుణుల కమిటీతో పరిశీలించి, తుది కీతో పాటు ఫలితాలను ప్రకటించినట్లు అధికారులు తెలిపారు. అభ్యర్థులు తమ ఫలితాలను ఖజ్ౌ్వ.ఖజూఎటంం.అఆ ... ఎంవ.ఖజూ.న్రశీజ.అఆ వంటి అధికారిక వెబ్‌సైట్ల ద్వారా తెలుసుకోవచ్చు. వీటితో పాటు 9552300009 అనే వాట్సాప్ నంబర్‌కు మెసేజ్ పంపి కూడా ఫలితాలను పొందవచ్చని సూచించారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
శనివారం 10 జనవరి 2026

# జాతీయ జంప్ రోప్ చాంపియన్‌షిప్‌లో..

# శ్రీ శాంతినికేతన్ స్కూల్ విద్యార్థుల ప్రభంజనం.










**ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 09:**

శ్రీ శాంతినికేతన్ స్కూల్ విద్యార్థులు జాతీయ స్థాయిలో తమ క్రీడా ప్రతిభను చాటుతూ పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. 202526 సంవత్సరానికి సంబంధించిన 22వ సబ్-జూనియర్ నేషనల్ జంప్ రోప్ చాంపియన్‌షిప్ & 20వ ఫెడరేషన్ కప్ పోటీలు జనవరి 5 నుంచి 7, 2026 వరకు చెన్నై, తమిళనాడులో నిర్వహించబడగా, ఈ పోటీల్లో శాంతినికేతన్ స్కూల్ విద్యార్థులు పలు పతకాలు సాధించారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో, శాంతినికేతన్ స్కూల్ విద్యార్థులు 4ఐ30 సెకన్ల స్పీడ్ రీలే (ఎస్ ఆర్ ఎస్ ఆర్), 2ఐ30 సెకన్ల ఎస్ ఆర్ ఎస్, 1ఐ30 సెకన్ల ఎస్ ఆర్ ఎస్ ఆర్ మరియు లాంగ్ రోప్ స్కిప్పింగ్ (ఎల్ఆర్ఎస్) విభాగాల్లో అద్భుత ప్రతిభ కనబరిచారు. పతకాలు సాధించిన విద్యార్థులు (తరగతివారీగా):ఆర్. సాయి రోహిత్ రెడ్డి (10వ తరగతి) వెండి పతకం (4ఐ30 సెకన్ల ఎస్ ఆర్ ఎస్ ఆర్), కాంస్య పతకం (ఎల్ఆర్ఎస్)డి.వి. సత్యానంద రెడ్డి (10వ తరగతి) వెండి పతకం (2ఐ30 సెకన్ల ఎస్ ఆర్ ఎస్ ఆర్), కాంస్య పతకం (ఎల్ఆర్ఎస్)ఎం. సుకుమార్ (6వ తరగతి) వెండి పతకం (1ఐ30 సెకన్ల ఎస్ ఆర్)బి. అఖిల్ కుమార్ నాయక్ (7వ తరగతి) వెండి పతకం (4ఐ30 సెకన్ల ఎస్ ఆర్ ఎస్ ఆర్)కె. వాలి (8వ తరగతి) కాంస్య పతకం (ఎల్ఆర్ఎస్)జి. మహబూబ్ బాషా (6వ తరగతి) కాంస్య పతకం (ఎల్ఆర్ఎస్)జి. శ్రీ రాములు (9వ తరగతి) కాంస్య పతకం (ఎల్ఆర్ఎస్)కె. మనీష్ కుమార్ (9వ తరగతి) కాంస్య పతకం (ఎల్ఆర్ఎస్)కె. ఓబులేష్ (7వ తరగతి) కాంస్య పతకం (ఎల్ ఆర్ ఎస్)ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ సుధాకర్ గారు విద్యార్థులకు పతకాలు అందజేసి హృదయపూర్వకంగా అభినందించారు. జాతీయ స్థాయిలో ఇలాంటి విజయాలు సాధించడం పాఠశాలకు గర్వకారణమని పేర్కొంటూ, ఈ ఫలితాలకు కారణమైన పి ఈ టి ఉపాధ్యాయుల కృషిని ప్రత్యేకంగా ప్రశంసించారు. విద్యార్థులను క్రీడల్లో ముందుకు నడిపించిన ఉపాధ్యాయుల శిక్షణ, మార్గనిర్దేశం అభినందనీయమని ఆయన అన్నారు. జాతీయ స్థాయిలో సాధించిన ఈ ఘన విజయం శ్రీ శాంతినికేతన్ స్కూల్ క్రీడా ప్రతిభకు స్పష్టమైన నిదర్శనంగా నిలిచింది.







## శాంతిరాం మెడికల్ విద్యార్థులకు..
## ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ రీసర్చ్ స్కాలర్‌షిప్.

### కళాశాల చైర్మన్ చేతుల మీదుగా ప్రశంస పత్రం,అవార్డు అందజేత.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 09:** 2024వ సంవత్సరంకు సంబంధించి ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వారు నిర్వహించిన రీసర్చ్ స్కాలర్‌షిప్ కు శాంతిరాం మెడికల్ కాలేజ్ విద్యార్థులు ఎంపికయ్యారు.ఎంపికైన శాంతిరాం మెడికల్ కళాశాల విద్యార్థినులకు శాంతిరాం మెడికల్ కళాశాల చైర్మన్ శాంతిరాముడు చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అవార్డులను అందజేశారు,శాంతిరామ్ వైద్య కళాశాలలో ఎంబిబిఎస్ చదువుతున్న ఇద్దరు వైద్య విద్యార్థులకు డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వారు నిర్వహించిన అండర్ గ్రాడ్యుయేట్ స్టూడెంట్ రీసెర్చ్ స్కాలర్షిప్ 2024 పథకం కింద అవార్డు సర్టిఫికెట్స్ పొందిన షేక్ హర్షియా భాను, పాపిరెడ్డి మోక్షిత లకు కళాశాల చైర్మన్ డాక్టర్ మిద్దె శాంతిరాముడు, ప్రిన్సిపల్ వసంత్ ఆర్ చావన్ సర్టిఫికెట్లు అందజేశారు.

## శ్రీ కాళికాంబ చంద్రశేఖర స్వామి ఆలయంలో
## వైభవంగా పల్లకి సేవ వార్షికోత్సవం.

### అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆలయ సిబ్బంది, భక్తులు.
### ముఖ్య అతిథిగా పాల్గొన్న టీడీపి రాష్ట్ర యువ నాయకులు ఎన్.ఎమ్.డి. ఫయాజ్.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జనవరి 09:**నంద్యాల పట్టణం కోటవీధిలో వెలసిన అత్యంత పురాతనమైన, సుప్రసిద్ధ శ్రీ కాళికాంబ చంద్రశేఖర స్వామి దేవస్థానంలో శుక్రవారం "అమ్మవారి పల్లకి ఉత్సవ పంచమ వార్షికోత్సవం" అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచే ఆలయంలో విశేష పూజలు ప్రారంభమయ్యాయి. అమ్మవారి మూలవిరాట్టుకు పంచామృత సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, పుష్పాలంకరణ సేవలు నిర్వహించారు. అనంతరం పల్లకి ఉత్సవ మూర్తికి భక్తుల సమక్షంలో అభిషేకాలు, ఒడిబియ్యం సమర్పణ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఎన్ఎండి ఫయాజ్ కు ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆయన అమ్మవారికి నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు అనంతరం ఎన్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ పట్టణ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, అమ్మవారి కృపాకటాక్షాలు అందరిపై ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కండె శ్యాంసుందర్ లాల్, బింగుమల్ల శ్యామ్ సుందర్ గుప్తా, డైరెక్టర్ ఉప్పరి సురేష్ కుమార్, బుగ్గ రాముడు, చలం బాబు దంపతులు, కాంట్రాక్టర్ రవి, అస్మద్దీన్ మరియు పల్లకి సేవ టీం సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## మొదటి ముస్లిం ఉపాధ్యాయురాలు షేక్ ఫాతిమా జయంతి వేడుకలు.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 09:**

మొట్టమొదటి ముస్లిం మహిళ ఉపాధ్యాయురాలు షేక్. ఫాతిమా 195 జయంతి సందర్భంగా నంద్యాల గిరినాథ్ సెంటర్ నందు వున్న యస్.వై.వి.సి.పి.గవర్నమెంట్ మహిళ జూనియర్ కళాశాల నందు డెమోక్రటిక్ విద్యార్థి,యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్.రియాజ్ అధ్యక్షతన పూలమాలలతో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్.నిరంజన్,నంద్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షులు హుస్సేన్ భాష, శ్రీశైలం ట్రస్ట్ బోర్డు మెంబర్ జిల్లెల్ల శ్రీదేవి,నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు నాగసారి సుంకన్న ఆర్పిఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు. సీనియర్ విద్యార్థి నాయకుడు పూల వెంకట్,మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సాంబశివుడు,టిడిపి రాష్ట్ర జనరల్ సెక్రెటరీ జిల్లెల్ల శ్రీరాములు,మాట్లాడుతూ మొట్టమొదటి ముస్లిం మహిళ ఉపాధ్యాయురాలు షేక్ ఫాతిమా మహారాష్ట్ర , పూణే నందు 09-01-1831 జన్మించారనిఆమె సావిత్రిబాయి పూలే కి ముఖ్య అనుచరురాలని మరియు సహా ఉపాధ్యాయినని,చరిత్రలో మొదటి పాఠశాల ప్రారంభించిన మొదటి వ్యక్తిగా జ్యోతిబాపూలే గౌరవం దక్కితే సావిత్రిబాయి పూలే కి తొలి ఉపాధ్యాయురానిగా గౌరవం దక్కుతుందని సావిత్రి భాయ్ పూలేముఖ్య అనుచారలిగా ఆమెను కూడా తొలి తరం ఉపాధ్యాయినిగానే ప్రజలు గుర్తుయించుకోవాలని దాదాపు 175 ఏళ్ళ కిందట ఫాతిమా షేక్. అణగారిన వర్గాల ప్రజలు ముఖ్యంగా మహిళల విద్య కోసం సావిత్రిబాయి పూలే తో కలిసి పని చేశారని 1848 జనవరి 1 వ తేదీన పూణేలోని బుధవార్ పేట్ లో మొదటి పాఠశాల ప్రారంభమైనప్పుడు సావిత్రిబాయి పూలే తో కలిసి ఫాతిమా షేక్ కూడా పాఠాలు బోధించే వారని, పూలే దంపతులు దళితులు అణగారిన వర్గాల మహిళలకు విద్య బోధించే సమయంలో చాలా ఇబ్బందులు పడే సమయంలో ఆ పోరాటంలో ఫాతిమా షేక్. కూడా వారి వెంటే వున్నారని మహాత్మా జ్యోతిరావు పూలే భార్య సావిత్రి భాయ్ పూలే తో పాటు ఎన్నో పాఠశాలలు మరియు విద్యాలయలు ఏర్పాటు చేశారని.కుల వివక్షత ,అంటరానితనం,ఆడవాళ్లు చదువుకుంటే చనిపోతారని ఆడ వాళ్ళని చదువుకు దూరం చేసే రోజుల్లో స్వచ్ఛందంగా తన ఇంటిని పాఠశాలగా మార్చి మహాత్మా జ్యోతిరావు పూలే కి మరియు వారి సతీమణి సావిత్రి భాయ్ పూలే కి తన ఇంటిలోనే ఆశ్రయం కల్పించి ప్రతి ఒక్కరు చదువుకోవాలని పోరాటం చేసినవారని, ఫాతిమా షేక్ గారి జీవిత చరిత్రను పాఠ్యాంశాలలో పొందుపరిచి విద్యార్థులకు చేరవేయాలని వారు అన్నారు ఈ కార్యక్రమంలో న్యాయవాది వనం శ్రీనివాసులు, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కే శోభారాణి, ఉర్దూ జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ రజియా, లెక్చరర్స్ సునీలకుమారి, భాగ్యమ్మ విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

## సెట్కూర్ జిల్లా పోటీల్లో శాంతిరామ్ విద్యార్థులకు బహుమతుల పంట.!

### డిబేట్,వ్యాసరచన,వక్తృత్వంలో శాంతిరామ్ విద్యార్థుల విజయాలు.

### జిల్లా స్థాయి పోటీలలో శాంతిరామ్ విద్యార్థుల ప్రతిభ..!

**నంద్యాల :ఆంధ్ర ప్రగతి**జాతీయ యువజన దినోత్సవ వేడుకల సందర్భంగా స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర యువజన సర్వీసులు,సెట్కూర్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి సాహిత్య పోటీలలో శాంతిరామ్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రమణ్యం తెలిపారు. ఈ పోటీల్లో విద్యార్థిని రేవతి చర్చ (డిబేట్) విభాగంలో ప్రథమ బహుమతిని సాధించి కళాశాలకు గౌరవం తెచ్చిందన్నారు.అలాగే వ్యాస రచన పోటీలో ప్రణతి ద్వితీయ బహుమతి,కౌసర్ తృతీయ బహుమతిని గెలుచుకున్నారని పేర్కొన్నారు.మరోవైపు



కమ్యూనికేషన్ నైపుణ్యాలు,వ్యక్తీకరణ సామర్థ్యాన్ని అద్భుతంగా ప్రదర్శించిన విద్యార్థిని కౌసర్ వక్తృత్వ పోటీలో కూడా తృతీయ బహుమతి సాధించడం విశేషమని తెలిపారు.విద్యార్థుల్లో మానసిక వికాసం,సృజనాత్మకత,నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే ఇలాంటి పోటీల ముఖ్య ఉద్దేశమని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.శాంతిరామ్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు అకాడమిక్ రంగంతో పాటు సహపాఠ్య కార్యకలాపాల్లోనూ ముందుంటున్నారని ఆయన గర్వంగా తెలిపారు.ఈ సందర్భంగా విజేతలందరినీ ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రమణ్యం ప్రత్యేకంగా అభినందించి,భవిష్యత్తులో రాష్ట్ర,జాతీయ స్థాయి పోటీల్లోనూ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బేసిక్ సైన్సెస్ విభాగాధిపతి డాక్టర్ బి.శేషయ్య,పోటీల సమన్వయకర్త ఎ.జి.వెంకటేశ్వరులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి.!

**ఖచ్చితమైన ప్రణాళికతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి.**

**భక్తులకు సౌకర్యవంతమైన, సంతృప్తికరమైన దర్శనం కల్పించాలి.**

**అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి.**






**ఆంధ్ర ప్రగతి శ్రీశైలం / నంద్యాల, జనవరి 09:** మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలం మహాక్షేత్రానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా, స్వామి-అమ్మవార్లను సౌకర్యవంతంగా దర్శించుకునేలా ఖచ్చితమైన ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం శ్రీశైల దేవస్థానం అన్నప్రసాద వితరణ భవన ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్‌తో కలిసి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై జిల్లా స్థాయి సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు, ఆత్మకూరు, దోర్నాల, శ్రీశైలం డీఎఫ్వోలు విగ్నేష్ అపోవా, నీరజ్, భవిత కుమారి, ట్రస్ట్ బోర్డు సభ్యులు భరద్వాజ శర్మ, అనిల్ కుమార్, గుండ్ల గంగమ్మ, కాశీనాథ్, రేఖ గౌడ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఫిబ్రవరి 8 నుంచి మార్చి 18 వరకు నిర్వహించనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో దేవస్థానం సిబ్బంది, పోలీస్, జిల్లా అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సౌకర్యవంతమైన, సంతృప్తికరమైన దర్శనం కల్పించేలా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. గత సంవత్సరం కంటే ఈ ఏడాది సుమారు 20 శాతం మేర అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అదనపు ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ప్రధానంగా పారిశుద్ధ్యం, త్రాగునీరు, మరుగుదొడ్లు, పార్కింగ్, రవాణా, క్యూలైన్ల నిర్వహణ, భక్తులకు శీఘ్రంగా సౌకర్యవంతమైన దర్శనం వంటి అంశాల్లో ఎలాంటి లోపాలు లేకుండా పనులు చేపట్టాలని అధికారులను సూచించారు. శ్రీశైల పరిసర ప్రాంతాలను 11 జోన్లుగా విభజించి, ప్రతి జోన్‌కు ప్రత్యేక అధికారులను నియమించి పర్యవేక్షణతో పాటు పకడ్బందీ చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. క్షేత్ర పరిధిలో పారిశుద్ధ్య పనులు నిరంతరంగా కొనసాగించేలా 24 గంటలు మూడు షిఫ్టులుగా శానిటేషన్ సిబ్బందిని నియమించాలని డీపీఓను ఆదేశించారు. లక్షలాది మంది పాదయాత్ర భక్తులు సుమారు 46 కిలోమీటర్ల దూరం నడిచి వచ్చే మార్గాల్లో మెడికల్ క్యాంపులు, అంబులెన్సులు, డస్ట్‌బిన్లు, టాయిలెట్లు, చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. 46 కిలోమీటర్ల పరిధిలోని కొలనులు, బావులు, అలాగే శ్రీశైల పరిధిలోని నీటి నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించాలని ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ ని ఆదేశించారు. పాదయాత్ర మార్గమంతటా త్రాగునీరు, చలువ పందిళ్లు, టాయిలెట్లను ఏర్పాటు చేయాలన్నారు. భీముని కొలను, కైలాసద్వారం ప్రాంతాల్లో భక్తులు ఆరోగ్య ఇబ్బందులకు గురయ్యే అవకాశాలు ఉన్నందున స్ట్రెచర్లు, అంబులెన్సులు సిద్ధంగా ఉంచాలని డీఎంఅండ్ హెచ్ఓను ఆదేశించారు. అత్యవసర వైద్య సేవల కోసం 7 అంబులెన్సులను సిద్ధంగా ఉంచడంతో పాటు, 10 ప్రదేశాల్లో మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయనున్నారు. భీముని కొలనులో భక్తుల రద్దీ అధికంగా ఉండే నేపథ్యంలో మూడు షిఫ్టులలో నిరంతర వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలతో పాటు ఇతర జిల్లాల నుంచి దాదాపు 1800 బస్సులు వచ్చే అవకాశం ఉన్నందున ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పటిష్టమైన ప్రణాళికతో పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని, తిరిగి వెళ్లే మార్గాల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. భక్తులకు అవసరమైన సమాచారాన్ని అందించేందుకు హెల్ప్‌డెస్క్‌లు, కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అటవీ శాఖ పరిధిలోని చెక్‌పోస్టుల వద్ద మహాశివరాత్రి పర్వదినాల్లో ఎలాంటి రుసుం వసూలు చేయకుండా వాహనాలను అనుమతించాలని ఫారెస్ట్ అధికారులకు సూచించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టడంతో పాటు, లింగాల గట్టు ప్రాంతంలో ప్రత్యేక అప్రమత్తతతో పర్యవేక్షణ నిర్వహించనున్నారు. భక్తుల భద్రతకు అత్యంత పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. భక్తులకు అవసరమైన సమాచారం అందించేందుకు హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేయడంతో పాటు, భక్తులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. ఆత్మకూరు నుంచి శ్రీశైలం వరకు రహదారి మరమ్మతులు చేపట్టి వాహనాల రాకపోకలు సులభతరం చేయాలని ఆర్ అండ్ బి అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రమాదాలకు ఆస్కారం ఉన్న మలుపుల వద్ద అద్దాలు ఏర్పాటు చేయడంతో పాటు, సమాచార సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఘాట్ రోడ్లలో భద్రత దృష్ట్యా అనుభవజ్ఞులైన డ్రైవర్లను నియమించి వాహనాల నిర్వహణ చేపట్టాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. దోమల నియంత్రణకు ఫాగింగ్ మిషన్లను వినియోగించాలని మలేరియా అధికారులను ఆదేశించారు. హోటళ్లలో విక్రయించే ఆహార పదార్థాల్లో కల్తీ జరగకుండా నమూనాలు సేకరించి తనిఖీలు నిర్వహించడంతో పాటు ధరల సూచిక బోర్డులు ప్రదర్శించేలా సివిల్ సప్లై, లీగల్ మెట్రాలజీ అధికారులను ఆదేశించారు. నిరంతర విద్యుత్ సరఫరాకు అవసరమైన ఏర్పాట్లు చేయడంతో పాటు అదనపు జనరేటర్లు సమకూర్చాలని ఏపీఎస్పీడీసీఎల్ అధికారులకు సూచించారు. జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్ మాట్లాడుతూ, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని సూచించారు. గతంలో చోటుచేసుకున్న చిన్న లోటుపాట్లను సరిదిద్దుకుంటూ, సుమారు 3 వేల మంది పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. క్యూలైన్లలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. అలాగే సాక్ష గణపతి సమీపంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఫారెస్ట్, పోలీస్ శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు, శ్రీశైలంలో భక్తుల కోసం చేపట్టిన ఏర్పాట్లను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ట్రాఫిక్ అంతరాయాలను తొలగించేందుకు 7 ప్రదేశాల్లో హైడ్రాలిక్ క్రేన్లు, రికవరీ వ్యాన్లను అందుబాటులో ఉంచామన్నారు. వాహనాల రద్దీ నియంత్రణకు 27 ఎకరాల విస్తీర్ణంలో 5,450 వాహనాలు పార్కింగ్ చేయగల సదుపాయాన్ని కల్పించనున్నట్టు తెలిపారు. ఈ ఏడాది భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మొత్తం 36 లక్షల లడ్డు ప్రసాదాలను తయారు చేయడంతో పాటు, వాటి పంపిణీ కోసం 15 లడ్డు ప్రసాదాల కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

## బుడగ జంగాల హాస్టల్ కు సహాయం అందించిన తూర్పాటి మనోహర్.

**బుడగ జంగాల రాష్ట్ర అధ్యక్షులు పిల్లలకు పరుపులు పంపిణీ**











**.ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 09:** నంద్యాల జిల్లా, వైయస్సార్ నగర్ లోని నేతాజి సుభాష్ చంద్రబోస్ ఆవాసియా విద్యాలయ (బుడగ జంగాల) అర్బన్ హాస్టల్ లో 140 మంది వసతితో బాల బాలికలు( రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద కుటుంబాల) పిల్లలు ఉంటున్నందుకు సంతోషమైన విషయం, సంచార దళిత యాచక వృత్తితో నిండి చదువులకు దూరంగా ఉంటున్న బాల్యపు పిల్లలను, ఈ యొక్క హాస్టల్ ద్వారా ప్రభుత్వం సహకారంతో న్యాయం చేస్తున్నందుకు సంతోషంగా ఉన్నదని ఆ రాష్ట్ర అధ్యక్షులు తూర్పాటి మనోహర్ తెలియజేశారు. ఈ యొక్క హాస్టల్లో ఆడపిల్లలు, మగ పిల్లలకు వేరువేరుగా వసతులు నిర్వాహకులు ఏర్పాటు చేశారు. మంచి క్వాలిఫైడ్ టీచర్లు ఈ యొక్క పిల్లల భవిష్యత్తుకు వెలుగు నింపాలని, మీదేనా కృషి, తెలివిని, ఉపయోగించి వీరిని మంచి ప్రవర్తన, వీరి జీవితాలకు వెలుగులు నింపేలా చూడాల్సిన బాధ్యత మీపై ఉంటుందని, అప్పుడే మీ వృత్తి ధర్మమానికి న్యాయం చేసిన వారుగా ఉంటారని ఆయన తెలియజేశారు. ఈ హాస్టల్ అన్ని సౌకర్యాలతో ఏర్పాటుతో ముందుకు పోతున్నందుకు సంతోషంగా ఉన్నదని, కానీ ప్రభుత్వము నిర్వాహకులకు బిల్డింగ్ అద్దెలు ఇవ్వకపోవడం, వారు రెంటుకు అవస్థలు పడడం చాలా బాధాకరమన్నారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ద్వారా వచ్చిన బెడ్ సీట్లను పిల్లలకు పంపిణీ చేయడం జరిగినది. మా జాతి పిల్లలను ఇంత బాగా చూసుకుంటున్నందుకు నిర్వాకులైన గడ్డం సుబ్బరాయుడును మరియు రాజేశ్వరమ్మ, సిబ్బందిని, మరి ముఖ్యంగా వంటవారిని అభినందించడం జరిగినది. ఈ యొక్క కార్యక్రమంలో బేడ బుడగ జంగం నంద్యాల అధ్యక్షులు సిరిసాల జమ్మన్న, సుంకమ్మ,బి. చింతలయ్య, హాస్టల్ నిర్వాకుడు గడ్డం. సుబ్బరాయుడు, ఎరుకల రాజేశ్వరి, హాస్టల్ వార్డెన్ నాగలక్ష్మి, టీచర్లు కమలబి,హుస్సేనబి, మమత, లక్ష్మీదేవి, సౌజన్య, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## నంద్యాల ఎంపి శబరికి చిరు జ్ఞాపికను అందించిన ఎంవీఆర్పీఎస్ నేతలు.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 09:** శుక్రవారం నాడు ఉదయం నంద్యాలకు చేరుకున్న ఎంపీ శబరి ని నంద్యాల రామకృష్ణ పీజీ కాలేజ్ దగ్గర కలిసి రామాయణంలో ఉన్న శబరి మాత ఫొటోతో పాటు ఎంపీ శబరి ఫొటోతో ఉన్న చిత్ర పఠాన్ని ఎంపీ కి ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు మరియు ఈ మధ్య వారి జన్మదినం జరుపుకోవడం వారు అందుబాటులో లేకపోవడంతో జన్మదిన శుభాకాంక్షలు కూడా తెలిపి వాల్మీకుల ఎస్టి పునరుద్దరణపై గతంలో ప్రభుత్వం హామీ ఇచ్చి ఉన్నందువల్ల త్వరితగతిన హామీ నెరవేరెలా కృషి చేయాలని విజ్ఞప్తి చేసిన ఎంవీఆర్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు బోయ పులికొండన్న,వారితో పాటు ఎంపీని కలిసిన ఎంవీఆర్పీఎస్ శ్రీశైల నియోజకవర్గ నేత రాగాల రమణ,నంద్యాల మండల నేత సంజీవ,బాల హుసేన్,పట్టణ నేతలు ఆర్.ఎం.పి మధు,విక్రమ్ కార్తీక్,సూర్య ,బొమ్మల సత్రం రామకృష్ణ,బొగ్గులైన్ ఓబులేసు, శేఖర్,రవి,దేవనగర్ పరమేష్,సాయి,రమేష్,మల్లికార్జున,గిరినాథ్ సెంటర్ నిఖిల్,సంగపేట మహేష్,రంగరాజ్ పేట శివ,ఉప్పిరిపేట శివ శంకర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యత లేకుండా ఎన్.హెచ్ 340బి రహదారి పనులు.

**కోట్ల రూపాయలు ప్రజాధనాన్ని సొమ్ము చేసుకుంటున్న ద్వారకామయి కన్‌స్ట్రక్షన్ కంపెనీ.**

**కమిషన్లకే పరిమితమైన అధికార యంత్రాంగం.**

**నాణ్యత గురించి మమ్మల్ని ప్రశ్నించేది ఎవరు అంటున్న ద్వారకమై కన్‌స్ట్రక్షన్ కంపెనీ. -భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)**






**ఆంధ్ర ప్రగతి బేతంచెర్ల జనవరి 09:** బేతంచెర్ల మండలంలోని గోరుమానుకొండ దగ్గర జరుగుతున్న నేషనల్ హైవే 340బి పనులను సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ ఆధ్వర్యంలో సందర్శించిన అనంతరం మాట్లాడుతూ డోన్ హైవే, నంద్యాల హైవే లను కలుపుతూ ప్రజలకు సౌకర్యవంతంగా రవాణా సౌకర్యాన్ని కల్పించాలని సదుద్దేశంతో 650 కోట్లతో జాతీయ రహదారి 340బి గత ప్రభుత్వ హయాంలో ద్వారకామయి కన్‌స్ట్రక్షన్ కంపెనీ పనులు ప్రారంభించడం జరిగింది సకాలంలో పనులు పూర్తికాకపోవడం చేత ఈ రహదారి నిత్యం రక్తమోడుతుందని, రోడ్డు ప్రమాదాలు నిత్య కృత్యాలయాయని ఆవేదన వ్యక్తం చేశారు ద్వారకామయి కన్‌స్ట్రక్షన్ కంపెనీ చేస్తున్న పనులను అధికార యంత్రాంగం పర్యవేక్షణ లేకపోవడంతో పనులలో నాణ్యత లేకుండా నాసిరకంగా కేవలం ధనార్జనే ధ్యేయంగా కోట్ల రూపాయల ప్రజాధనాన్ని సొమ్ము చేసుకుంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు పనులు సకాలంలో పూర్తి చేయకుండా వారి ఇష్టారీతిన పనులు చేస్తూ, సంవత్సరాలు గడుస్తున్నా, రోడ్డు ప్రమాదాలు సంభవించి ప్రయాణికులు మరణిస్తున్నా, వందలాది మంది ప్రయాణికులు ప్రమాదాలకు గురై కిందపడి అంగవైకల్యం బారిన పడిన మాకు సంబంధం లేదు, మాకు ఇష్టం వచ్చినప్పుడే జాతీయ రహదారి పూర్తవుతుందనే పద్ధతిలో పనులు జరుగుతున్నాయని నాణ్యత గురించి ఎవరైనా ప్రశ్నిస్తే.. వాళ్లకు ఉన్న అధికార బలాన్ని ఉపయోగించి ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయిస్తామని బాహాటంగానే మాట్లాడుతున్నారంటే వారి దోపిడీ ఏ రకంగా ఉందో స్థానిక ప్రజలకు అర్థమవుతుందన్నారు, ఒకవైపు రహదారిలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించకుండా, మరోవైపు ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్న, జాతీయ రహదారి పనులను నాణ్యత లేకుండా నాసిరకంగా చేస్తూ అధికారంలో ఎవరు ఉంటే వారికి కమిషన్లు పంచుకుంటూ కేవలం ధనార్జనయ ధ్యేయంగా కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ద్వారకామయి కన్‌స్ట్రక్షన్ కంపెనీ సొమ్ము చేసుకుంటుందని ఆరోపించారు ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి ప్రయాణికుల ప్రాణానికి ప్రధాన కారణమైన ద్వారకామయి కన్‌స్ట్రక్షన్ కంపెనీ పనులను అధికార యంత్రాంగం, డోన్ నియోజకవర్గ శాసనసభ్యులు, నంద్యాల పార్లమెంటు సభ్యులు, ప్రజాప్రతినిధులు విచారణ చేపట్టి బిల్లులను చేయకుండా నిలుపుదల చేయాలని, ఇచ్చిన బిల్లులను సైతం ఆర్.ఆర్ యాక్ట్ ద్వారా ప్రజాధనాన్ని రికవరీ చేయాలని డిమాండ్ చేశారు లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి తాలూకా తిరుమలేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్, సిపీఐ నాయకులు మధు, ప్రదీప్, ఖదీర్, రాముడు, గోపి, రవి, షేక్షవలి, శోభన్ బాబు, ఉదయ్, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ ముస్లిం స్వర్ణకార సంఘం 2026 క్యాలెండర్ ఆవిష్కరణ.

**రాష్ట్ర కమిటీ నూతన సభ్యులకు ఘనంగా సన్మానం.**

**ముస్లిం స్వర్ణకారుల సంక్షేమానికి కృషి చేస్తాం.**

**టీడీపీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జనవరి 09:** నంద్యాల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ముస్లిం స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన క్యాలెండర్ - 2026 ను టీడీపీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ శుక్రవారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ ముస్లిం స్వర్ణకారుల సమస్యల పరిష్కారానికి, వారి సామాజిక అభివృద్ధికి సంఘం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ మైనారిటీల సంక్షేమానికి కట్టుబడి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం, ఆంధ్రప్రదేశ్ ముస్లిం స్వర్ణకార సంఘం రాష్ట్ర కమిటీలో నంద్యాల నుంచి నూతనంగా ఎంపికైన రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఎన్నికైన గోల్డ్ అమీర్ భాయ్, రాష్ట్ర కోశాధికారిగా (స్టేట్ ట్రెజరర్) ఎన్నికైన మహమ్మద్ యాకూబ్ ను ఎన్ఎండి ఫయాజ్ శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. సంఘం బలోపేతానికి వీరు శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మునియార్ ఖలీల్, రాష్ట్ర అధికార ప్రతినిధి అమీర్ భాయ్ , స్టేట్ ట్రెజరర్ మహమ్మద్ యాకూబ్, అధ్యక్షులు నసిరుల్లా, కార్యదర్శి రసూల్, ట్రెజరర్ మాలి భాష, జాయింట్ సెక్రెటరీ జాఫర్, సలహాదారులు జాకీర్, గౌరవాధ్యక్షులు ఉస్మాన్ భాష, కాజా మొహిద్దిన్, ఉపాధ్యక్షులు అబ్బాస్, అయూబ్ , సంఘం ప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# సిసిసి బాక్స్ క్రికెట్ స్టేడియాన్ని ప్రారంభించిన ఎన్ఎండి ఫయాజ్.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 09:** నంద్యాల ఎల్ కె ఆర్ ఫంక్షన్ హాల్ దగ్గర బజాజ్ షోరూం పక్కన ఎం.చౌరెడ్డి ఏర్పాటుచేసిన చౌహాన్ ఛాంపియన్ క్రికెట్ (సీసీసీ) బాక్స్ క్రికెట్ స్టేడియాన్ని టీడీపీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ.. నేటి యువత చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని పిలుపునిచ్చారు. బాక్స్ క్రికెట్ వంటి క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక ధృఢత్వానికి తోడ్పడతాయని, స్థానిక యువతలోని ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి స్టేడియాలు మంచి వేదికలని ఆయన కొనియాడారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఆడి గెలుపోటములను సమానంగా స్వీకరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 31 వార్డ్ టీడీపీ ఇంచార్జి కేఎల్ దీపక్ రెడ్డి, మైనార్టీ ఫైనల్ కార్పొరేషన్ డైరెక్టర్ మునియార్ ఖలీల్, గోస్పాడు బీసీ నాయకుడు ఫరూక్ హుస్సేన్, మనోజ్, బాలన్న తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థులను అన్ని విధాలుగా ఆదుకుంటాం.

-విద్యార్థులకు నోట్ పుస్తకాలు, బ్యాగుల పంపిణీ.

- టిడిపి యువనాయకులు ఎన్ఎండి ఫయాజ్.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 09:** నంద్యాల పట్టణంలోని ఎస్.ఆర్.బి.సి కాలనీలో ఉన్న 'పరివర్తన హెల్ప్ సెంటర్' విద్యార్థులకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ అండగా నిలిచారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు మరియు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ పేద విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువుకు దూరం కాకూడదన్న ఉద్దేశంతో ఈ సాయం అందించినట్లు తెలిపారు. క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన విద్యార్థులకు పిలుపునిచ్చారు. సామాజిక బాధ్యతగా విద్యార్థులకు అండగా నిలుస్తున్న పరివర్తన హెల్ప్ సెంటర్ సేవలను ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా ఇచ్చే ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని చేపడతామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పరివర్తన హెల్ప్ సెంటర్ ప్రతినిధులు, మాజీ కౌన్సిలర్ శివశంకర్ యాదవ్, ఎం కృష్ణాపురం శేఖర్ రెడ్డి మరియు టిడిపి నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# భక్తి మనస్సుకు నిర్మలత్వాన్నిస్తుంది.

డాక్టర్ మల్లు వేంకట రెడ్డి, తి.తి.దే.



**ఆంధ్ర ప్రగతి సంజామల జనవరి 09:** భక్తి మనస్సుకు నిర్మలత్వాన్ని కలిగిస్తుందని, నిర్మలమైన మనస్సే దేవుని నిలయమని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహలు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో సంజామల మండలం, కానాల గ్రామం, బి. సి. కాలనీలోని శ్రీరామాలయం నందు గత నాలుగు రోజులనుండి నిర్వహిస్తున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శుక్రవారం గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూడు రోజులపాటు ఇస్కాన్ ధర్మ ప్రచారకులు నిత్యతృప్తదాస్ శ్రీమద్రామాయణం, మహాభారతం, భగవద్గీతలపై చేసిన ధార్మిక ప్రవచనాలు భక్తులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో ధర్మ ప్రచారమండలి సభ్యులు పులి గోవర్ధన్ రెడ్డి, సిద్ధి పవన్ కుమార్ రెడ్డి, భజన మండలి సభ్యులు ముడియం కృష్ణుడు, ఎద్దుల రామకృష్ణుడు, బయటపాటి తిరుపాలు, బొడ్డుమీద నాగన్న, బత్తుల బాలతిమ్మయ్య, గడ్డం రాజా, తలారి మురళి, ధన్నవాడ రామాంజనేయులు, మహానందిగారి శివరామ స్వామి, చెన్నంపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులందరికీ ఆలయ కమిటీ ప్రసాద వితరణ చేశారు.

# నంద్యాల టిడిపి కార్యాలయంలో వేద సాయినాథ్, మహబూబ్ బాషా (గుల్లి) పుట్టినరోజు వేడుకలు.

ముఖ్య అతిథిగా పాల్గొన్న టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్.









**ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 09:** నంద్యాల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ పార్టీ నాయకుల పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. టిడిపి 25వ వార్డు ఇంచార్జి వేద సాయినాథ్ మరియు జిల్లా టిడిపి యూత్ ప్రెసిడెంట్ మహబూబ్ బాషా (గుల్లి) పుట్టినరోజును పురస్కరించుకొని పార్టీ శ్రేణులు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ వేడుకలకు టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేద సాయినాథ్, మహబూబ్ బాషా (గుల్లి) లతో కలిసి ఆయన కేక్ కట్ చేయించి, వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ టీడీపీ పార్టీ బలోపేతానికి యువ నాయకత్వం ఎంతో అవసరమని, వేద సాయినాథ్ మరియు మహబూబ్ బాషా తమదైన శైలిలో ప్రజల్లో ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నారని కొనియాడారు. భవిష్యత్తులో వారు మరిన్ని ఉన్నత పదవులు అధిష్టించాలని, ప్రజా సేవలో ముందుండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మునియర్ ఖలీల్, కౌన్సిలర్ నాగార్జున, మిద్దె హుస్సేన్, గోస్పాడు నాయకులు ఫరూక్ హుస్సేన్, మనోజ్ మరియు స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు, అనుబంధ విభాగాల ప్రతినిధులు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని పుట్టినరోజు జరుపుకుంటున్న నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు.

# జిల్లెల్ల గ్రామంలో పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేసిన ఎన్ఎండి ఫయాజ్.







**ఆంధ్ర ప్రగతి గోస్పాడు, జనవరి 09:** నంద్యాల నియోజకవర్గ గోస్పాడు మండలం జిల్లెల్ల గ్రామంలో శుక్రవారం పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. టీడీపీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ ముఖ్య అతిథిగా హాజరై, గ్రామంలో నూతనంగా నిర్మించనున్న హోమియోపతి ఆసుపత్రి భవనానికి మరియు పాఠశాల భవనానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్యం మరియు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ఈ భవనాల నిర్మాణాన్ని చేపట్టినట్లు తెలిపారు. నిర్ణీత సమయంలోగా నాణ్యతతో ఈ పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను, కాంట్రాక్టరును కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లెల్ల గ్రామ టీడీపీ నాయకులు సదాశివరెడ్డి, నారాయణరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, అస్మద్దీన్, కాంట్రాక్టర్ రవిచంద్ర రెడ్డి, దీపక్ రెడ్డి, బుగ్గ రాముడు, మిద్దె హుస్సేన్ మరియు ఇతర కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# బాల అకాడమీ పాఠశాలలో వైభవంగా సంక్రాంతి సంబరాలు.













**ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 09:** నంద్యాల పట్టణంలోని పార్కు రోడ్డు సమీపంలో గల బాల అకాడమీ పాఠశాలలో 09 వ తేదిన అనగా శుక్రవారం ముందుస్తుగా సంక్రాంతి సంబరాలను జరుపుకోవడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా పాఠశాల డైరెక్టర్ శ్రీ ఎం జీవి. రవీంద్రనాథ్, కరస్పాండెంట్ శ్రీ మతి మాధవీ లత మేడమ్ గారు విచ్చేసి మాట్లాడతూ సంక్రాంతి (లేదా) మకర సంక్రాంతి భారత దేశంలోని హిందూ పండుగల్లో అత్యంత ప్రముఖమైన పండుగ. ఈ పండుగ రోజే సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశిస్తాడు. ప్రతి సంవత్సరం జనవరి 14 లేదా 15వ తేదిలలో ఈ పండుగను జరుపుకుంటారు. ఈ పండుగను మూడు రోజులు చేస్తారు. మొదటి రోజు భోగి, రెండవ రోజు మకర సంక్రాంతి మూడవ రోజు కనుమ అని, పిల్లలకు అర్థమయ్యేలా సంక్రాంతి పండుగ యొక్క ప్రాముఖ్యతను చక్కగా తెలియజేశారు పాఠశాల చిన్నారుల తమ నృత్యాలతో, గీతాలతో అందరిని అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, చిన్నారులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# అన్న తారకరాముడి పట్టాభిషేకానికి 43 ఏళ్లు..!

**తెలుగుదేశం పార్టీ స్థాపించిన తొమ్మిది నెలల్లోనే అధికారం చేపట్టిన ఏకైక వ్యక్తి ఎన్టీఆర్.**

**ఢిల్లీ పునాదుల్ని కదిలించిన ఏకైక తెలుగోడు ఎన్టీఆర్. పేదవాడికి కూడు గూడు గుడ్డ అందించిన ఏకైక ముఖ్యమంత్రి ఎన్టీఆర్.**

**- టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వహీద్ హుస్సేన్.**





**ఆంధ్ర ప్రగతి కర్నూలు జనవరి 09:**
సరిగ్గా 42 సంవత్సరాల క్రితం ఇదే రోజున అన్నగారు ముఖ్యమంత్రి గా ప్రమాణస్వీకారం చేశారు.1983 జనవరి 9 తెలుగు కీర్తి దిగ్దిశాంతాలు దాటిన రోజు రాజకీయం ఏసీ గదులు దాటి గుడిసెకు చేరిన రోజు పేదవాడికి అన్నం రుచి తెలిసిన రోజు దేశంలో సరికొత్త రాజకీయం మొదలైన రోజు నాటి ఢిల్లీ పాలకులకు తెలుగువాడి వాడి,వేడి తెలిసిన రోజు తెలుగు జాతికి పండుగ రోజుతెలుగు నేల పులకించిన రోజు 35 ఏళ్ల అహంకారానికి చరమగీతం పాడిన రోజు సరికొత్త ఆంధ్రావనికి నాంది పలికిన రోజు నందమూరి తారకరాముడు తెలుగుదేశాధీసుడిగా పట్టాభిషిక్తుడైన రోజురామారావు గారు ప్రజలమనిషి రాజభవన్ గోడలు ఆయనకు ఇరుకుగా అనిపించాయి.అందుకే తాను లాల్ బహదూర్ స్టేడియంలో ప్రజల సమక్షంలో ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయాలని కోరుకున్నారు.రాష్ట్ర చరిత్రలో అంతకు ముందు ఎవ్వరూ రాజభవన్ బయట ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయలేదు.జనవరి 9 వ తేదీన లాల్ బహదూర్ స్టేడియం రికార్డు సంఖ్యలో రెండున్నర లక్షల మంది జనంతో కిటకిటలాడింది. చాలామంది లోపలికి వెళ్లలేక బయటే ఆగిపోయారు.ఆ చారిత్రక సన్నివేశాన్ని స్వయంగా చూసేందుకు రాష్ట్రం నలుమూలల నుంచీ లారీల్లో,రైళ్ళలో,బస్సుల్లో జనాలు తరలివచ్చారు. హైదరాబాద్ నగరమంతా పండుగ వాతావరణం అలముకుంది.ఆ రోజు జరిగిన ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఒక ప్రత్యేకత ఉంది.గాంధేయవాది అయిన కె.సి. అబ్రహాం జనతా పార్టీ అధికారంలో ఉండగా ఆంధ్ర రాష్ట్రానికి గవర్నరుగా వచ్చారు.అంతకు ముందు పనిచేసిన రాష్ట్ర గవర్నర్లందరూ కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు వచ్చినవారే.అలాంటి కె.సి. అబ్రహాం గారు రాష్ట్రానికి తొలి కాంగ్రేసేతర ముఖ్యమంత్రి గా రామారావు గారి పదవీస్వీకార ప్రమాణం చేయించారు.రామారావు గారు తెలుగులో ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకారోత్సవం తర్వాత ప్రజలను ఉద్దేశించి చేసిన అరగంట ప్రసంగంలో రామారావు గారు తాను మ్యానిఫెస్టోలో చేసిన ప్రతి వాగ్దానాన్నీ పూర్తి చేస్తానన్నారు.ప్రజలకు సేవ చేయాలనేదే జీవితంలో తన ఏకైక కోరిక అని ఆయన నొక్కి చెప్పారు. రామారావు రాష్ట్ర ముఖ్యమంత్రి అయిన తరువాత కూడా ఆయన దైనందిక జీవనశైలిలో మార్పులేదు.విశ్రాంతికి అవకాశమే లేదు.ప్రజాసంక్షేమం కోసం ఆయన తన జీవితాన్ని అంకితం చేశారు.ఆయనకు అధికారం అంటే విలాసం కాదు,బాధ్యత. క్రమశిక్షణ, క్రమవర్తన, సమయపాలన ఆయన జీవితసూత్రాలు.అవి ఆయన రాజకీయ జీవితంలో కూడా భాగమయ్యాయి. ముఖ్యమంత్రిగా జీతము తీసుకోనని రామారావు చెప్పారు.కానీ ప్రభుత్వ నిబంధనలు దానికి ఒప్పుకోవు.అందుకని నెలకు ఒక రూపాయి గౌరవ వేతనంగా తీసుకొనేందుకు అంగీకరించారు. వైభవోపేతమైన ముఖ్యమంత్రి నివాసానికి మారడానికి ఆయన అంగీకరించలేదు.తన అబిడ్స్ ఇల్లు తనకు చాలన్నారు.ఖరీదైన విలాసమంతమైన కార్లను వద్దన్నారు.అంబాసిడర్ కారు చాలన్నారు. ముఖ్యమంత్రి హోదాకు అనుబంధంగా వచ్చే ఎన్నో విలాసాలను సౌకర్యాలను ఆయన స్వచ్ఛందంగా వదులుకున్నారు.

# గ్రీవెన్స్ లో ప్రజాసమస్యలకు భూమా అఖిలప్రియ భరోసా.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 09:**నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ కార్యక్రమంలో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆళ్లగడ్డ మండల పరిధిలోని ప్రజలు 150కు పైగా అర్జీలు సమర్పించారు. నివాస గృహాలు, వృద్ధాప్య పెన్షన్, వికలాంగుల పెన్షన్ పెంపు, రెవెన్యూ సంబంధిత సమస్యలు, సీసీ రోడ్లు, డ్రైనేజ్ వంటి ప్రజా సమస్యలు పెద్ద ఎత్తున తన దృష్టికి వచ్చాయని ఎమ్మెల్యే తెలిపారు.ప్రజలు అందజేసిన అర్జీలపై సంబంధిత శాఖల అధికారులతో అక్కడికక్కడే మాట్లాడి సమస్యలను వేగంగా పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి అర్జీకి తక్షణ పరిష్కారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆళ్లగడ్డ మండలంలో ఎలాంటి సమస్యలు లేకుండా ప్రజలకు అవసరమైన అన్ని సమస్యలను పరిష్కరిస్తూ అభివృద్ధికి ఎల్లవేళలా అండగా ఉంటామని భూమా అఖిలప్రియ పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల కోసం నిరంతరం కష్టపడుతుంటే వైసీపీ నాయకులు డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఇటీవల లిఫ్ట్ ఇరిగేషన్ అంశం, అనంతరం రాజధాని అంశంపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. అసెంబ్లీకి రాని వైసీపీ ఎమ్మెల్యేలకు జీతాలు మాత్రం కావాలని వ్యాఖ్యానించారు. ఇదే ధోరణి కొనసాగితే వచ్చే ఎన్నికల్లో వైసీపీకి పదకొండు సీట్లు కూడా రావని స్పష్టం చేశారు.వైసీపీ నాయకులు అనవసర రాజకీయాలు మానుకుని ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రజా సమయాన్ని వృథ చేసే డైవర్షన్ రాజకీయాలను తీసుకురావద్దని భూమా అఖిలప్రియ తెలిపారు.

# ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

**సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి.**

**డోన్ బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం యస్. మైమున్నీసా.**

**ఆంధ్ర ప్రగతి డోన్ జనవరి 09:**



డోన్ నలంద హై స్కూల్ నందు సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి ఆధ్వర్యంలో డోన్ బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం యస్. మైమున్నీసా అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో హై స్కూల్ విద్యార్థులకు స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ పై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగాడోన్ బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం యస్. మైమున్నీసా , సామాజిక కార్యకర్త పి.మహమ్మద్ రఫిమాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వారు తెలిపారు. విద్యార్థులతో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించి వాతావరణ కాలుష్యం, ఆరోగ్యం, పలు అంశాల పై అవగాహణ కల్పించి విద్యార్థులు ప్రతిఒక్కరు మొక్కలు నాటి మహావృక్షాలుగా చేసి, ప్లాస్టిక్ ని వాడకుండా వాతావరణ కాలుష్యాన్ని నివారించాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి తెలిపారు.'స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్' పట్టణాలు,గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని ఈ లక్ష్యంతోనే ప్రతి నెల మూడవ శనివారం 'స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్' నిర్వహించాలని ప్రభుత్వం ప్రణాళిక వేసిందని ప్లాస్టిక్ రహిత జీవనశైలిని ప్రతి ఒక్కరు అవలంబించాలని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి పిలుపునిచ్చారు. ప్రజలు మరియు అధికారుల సమిష్టి కృషితో స్వచ్ఛాంధ్ర సాధ్యమని, ప్లాస్టిక్ వల్ల కలిగే ముప్పును ప్రజలు గ్రహించాల్సిన ఆవస్యకత ఉన్నదని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరు పాటించాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల దోమలు వృద్ధి చెందకుండా దోమకాటు నుంచి వచ్చే విష జ్వరాల నుంచి కాపాడుకోవచ్చని తెలియజేశారు. వాతావరణ కాలుష్యాన్ని నివారించడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములై గాలిలో ఆక్సిజన్ శాతాన్ని పెంచేందుకు కృషి చేయాలి. వాతావరణ కాలుష్యానికి హానికరమైన ప్లాస్టిక్ నిరోధించాలి. ప్లాస్టిక్ ని వాడకుండా మన ఆరోగ్యాలు మనమే కాపాడుకోవాలి. విరివిగా మొక్కలు నాటి మహావృక్షాలుగా తయారు చేసి వాతావరణ కాలుష్యాన్ని నివారించి ఓజోన్ పరిరక్షణ - ఓజోన్ పొరను రక్షించుకోవాలని తెలిపారు. నీటిని వృథా చేయకుండ జలసంక్షోభాన్ని అరికట్టాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరిని మర్యాద పూర్వకంగా కలిసిన ప్రముఖులు.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 09:**
నంద్యాల పట్టణం బొమ్మలసత్రం లోని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కార్యాలయంలో శుక్రవారం నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరిని నంద్యాల ప్రముఖులు మర్యాద పూర్వకంగా కలిచి 2026 నూతన ఆంగ్ల నామ శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరిని మర్యాద పూర్వకంగా కలిసిన వారిలో ఇటీవల ప్రమాణ స్వీకారం చేసిన శ్రీ ప్రథమనందీశ్వర దేవస్థానం పాలక మండలి చైర్మన్ సి. వెంకట చలం బాబు, పాలకమండలి సభ్యులు, శ్రీశైల దేవస్థానం పాలకమండలి డైరెక్టర్ జిల్లెల్ల శ్రీదేవి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి. జిల్లెల్ల శ్రీరాములు, నంద్యాల పార్లమెంట్ జనసేన ఇంచార్జి భవనాసి శ్రీనివాసులు ( భవనాసి వాసు), సీనియర్ న్యాయవాది, మాజీ సిపిఎం మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి. శంకరయ్య.మూలమఠం శ్రీ భీమలింగేశ్వరస్వామి దేవస్థానం పాలకమండలి చైర్మన్ పసుపులేటి నారాయణ, వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర నాయకులు పులి కొండన్న, నంద్యాల మార్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లికార్జున గుప్తా, ఆర్యవైశ్య సంఘం నంద్యాల జిల్లా నాయకులు భవనాసి మహేష్, మారం. వినయ్, వడ్డెర సంఘం రాష్ట్ర నాయకులు శ్రీనివాసులు, చక్రధర్, గోస్పాడు మండల టీడీపీ కన్వీనర్ కాటంరెడ్డి తులశీశ్వరరెడ్డి, బి ఎస్ ఎన్ ఎన్ సలహా కమిటీ మెంబర్ పెరుమాళ్ళ విజయకుమార్ తదితరులు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరిని మర్యాద పూర్వకంగా కలిసి కొన్ని సమస్యలు ఆమె దృష్టికి తెచ్చారు. వాటిని పరిష్కరిస్థానని ఆమె హామీ ఇచ్చారు.

# మొదలైన సంక్రాంతి ప్రయాణాలు

**ఊరిబాట పట్టిన పట్టణ ప్రజలు**

**-బస్టాండ్లు, రైల్వేస్టేషన్ల వద్ద రద్దీ**

**విజయవాడ రహదారిలో బారులు తీరిన వాహనాలు**

హైదరాబాద్,**జనవరి 09ఆంధ్ర ప్రగతి**విద్యా సంస్థలకు శనివారం నుంచి సంక్రాంతి సెలవులు రావడంతో శుక్రవారం సాయంత్రం నుంచే హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ మొదలైంది. సంక్రాంతి పండగకు 3 రోజుల ముందే పయనమవుతుండటంతో జాతీయ రహదారిపై వాహనాల సందడి నెలకొంది. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడకుండా జాతీయ రహదారిపై పోలీసులు పటిష్ఠ చర్యలు చేపట్టారు. హైవేపై వెళ్లే వాహనాలకు అంతరాయం కలగకుండా యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో నారాయణపురం రోడ్డును పోలీసులు మూసివేశారు. పంతంగి టోల్‌ప్లాజా వద్ద మొత్తం 16 టోల్ బూత్‌లు




ఉండగా వాహనాల రద్దీని దృష్టిలో పెట్టుకొని పదింటిని విజయవాడ మార్గంలోనే తెరిచారు. ఫాస్టాగ్ విధానం అమలులో ఉండటంతో వాహనాల రాకపోకలు సాఫీగా సాగుతున్నాయి. అదనపు టోల్ సిబ్బందిని నియమించారు. శని, ఆదివారాల్లో రద్దీ అధికంగా ఉండనుంది. సంక్రాంతి పండుగ సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు కిక్కిరిపోతున్నాయి. శనివారం నుంచి విద్యాసంస్థలకు సెలవులు, ఆఫీసులకు వీకెండ్ కావడంతో స్వగ్రామాలకు వెళ్లేందుకు హైదరాబాద్ నగర వాసులు పోటెత్తారు. పట్టణాల నుంచి సొంతూళ్లకు బయలుదేరిన ప్రయాణికులతో ఆర్టీసీ బస్టాండ్లు కళకళలాడుతున్నాయి. మరోవైపు సొంత వాహనాల్లోనూ ప్రజలు స్వగ్రామాలకు బయలుదేరుతున్నారు. దీంతో ప్రధాన రహదారులన్నీ వాహనాలమయంగా మారిపోయాయి. ÷ఎఖ్యంగా హైదరాబాద్ నుంచి తెలంగాణలోని వివిధ ప్లలెలు, ఆంధప్రదేశ్‌లోని పలు ప్రాంతాలకు వెళ్లే వారితో రోడ్లన్నీ నిండిపోయాయి. హైదరాబాద్- విజయవాడ 65వ జాతీయ రహదారి అయితే మరింత రద్దీగా మారింది. పంతంగి టోల్ గేట్ వద్ద వాహనాల బారులు తీరాయి. దీంతో స్వగ్రామాలకు వెళ్లే వారికి ట్రాఫిక్ సమస్యగా మారిపోయింది. రద్దీ సమస్యను దృష్టిలో ఉంచుకుని ప్రయాణాలు చేయాలని సంబంధిత అధికారులు సూచిస్తున్నారు.

# అద్దెబస్సుల సమ్మె పిలుపు విరమణ

**ఆర్టీసీ ఎండితో బస్సుల యజమాన్యాల చర్చలు**




అమరావతి,**జనవరి 09ఆంధ్ర ప్రగతి**ఆర్టీసీలో అద్దె బస్సుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం సంబంధిత యాజమాన్యం ఈనెల 12 నుంచి ఇచ్చిన సమ్మె పిలుపును అద్దె బస్సుల యజమానులు విరమించు కున్నారు. సదరు సంఘాల నేతలతో ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు చర్చలు జరిపిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. తాము ప్రధానంగా ఎదుర్కొంటున్న 5 సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎండీ ద్వారకా తిరుమలరావు ముందుంచారు. బస్సుల్లో ఓవర్ లోడ్ వల్ల వచ్చే సమస్యలను పరిష్కరించడం,బస్సు ప్రమాదానికి గురైనపుడు ఇచ్చే ఇన్సూరెన్స్ సమస్యలకు పరిష్కారం చూపడం.కేఎంపీఎల్ ను 5.77 నుంచి 5.27కు తగ్గించడం, నిర్వహణా ఖర్చుల కోసం ఇచ్చే మొత్తాన్ని పెంచడం.అద్దె బస్సుల వాహన కార్మికులకు ఇచ్చే వేతనాలను పెంచడం వంటివి ఉన్నాయి. అయితే.. పై సమస్యలన్నింటినీ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డితో ఎండీ తిరుమలరావు చర్చించారు. అనంతరం.. ఈనెల 20లోగా సమస్యలను పరిష్కరిస్తామని అద్దె బస్సుల యజమానులకు ఎండీ హామీ ఇచ్చారు. దీంతో ఈనెల 12 నుంచి తలపెట్టిన సమ్మెను విరమించుకుంటున్నట్లు బస్సుల యజమానులు వెల్లడించారు. పండుగ వేళ ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకే విరమణ నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటించారు.

# అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలతోనే యువతకు ఉజ్వల భవిష్యత్తు.!

## నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.

## శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాలలో అట్టహాసంగా ప్లేస్‌మెంట్ డ్రైవ్ - ప్రముఖ బహుళ జాతి సంస్థల ఎంపిక ప్రక్రియ.










**ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 09:** విద్యానగరంగా ఖ్యాతి గాంచిన నంద్యాల పట్టణంలోని శ్రీ రామకృష్ణ డిగ్రీ, పీజీ (అటానమస్) కళాశాల ప్రాంగణంలో ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో "మెగా ప్లేస్‌మెంట్ డ్రైమ అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నంద్యాల పార్లమెంటు సభ్యురాలు బైరెడ్డి శబరి విచ్చేసి జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

### యువతే దేశ సంపద - ఎంపి బైరెడ్డి శబరి:

ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీ బైరెడ్డి శబరి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. యువత దేశానికి వెన్నెముక అని, కేవలం డిగ్రీ పట్టాలు సాధించడమే కాకుండా సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. నంద్యాల వంటి ప్రాంతంలో శ్రీ రామకృష్ణ విద్యాసంస్థలు విద్యార్థులకు చదువుతో పాటే ప్రముఖ కంపెనీలలో ఉద్యోగాలు కల్పించడం అభినందనీయమన్నారు. గ్రామీణ విద్యార్థులు ఆత్మన్యూనతా భావాన్ని వీడి, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై పట్టు సాధిస్తే ప్రపంచంలో ఏ మూలైనా రాణించగలరని ఆమె విద్యార్థులలో స్ఫూర్తిని నింపారు.

### నాణ్యమైన విద్య మా లక్ష్యం

**- చైర్మన్ ప్రొఫెసర్ జి. రామకృష్ణారెడ్డి:**

సభకు అధ్యక్షత వహించిన శ్రీ రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ ప్రొఫెసర్ జి. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. తమ కళాశాల విద్యార్థులు చదువు పూర్తయిన వెంటనే తల్లిదండ్రులకు భారం కాకుండా స్వయం సమృద్ధి సాధించాలన్నదే తమ ఆశయమని తెలిపారు. ఇందుకోసం పాఠ్య ప్రణాళికలోనే స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులను చేర్చామని, అందుకే నేడు ఇంతమంది ప్రముఖ కంపెనీల ప్రతినిధులు మన కళాశాలకు వచ్చారని హర్షం వ్యక్తం చేశారు.

### సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

**- అన్నే సుధీర్ కుమార్ :**

గౌరవ అతిథిగా విచ్చేసిన సీఈఓ శ్రీ అన్నే సుధీర్ కుమార్ మాట్లాడుతూ.. ప్రస్తుత సాఫ్ట్‌వేర్ రంగంలో వస్తున్న మార్పులు, కృత్రిమ మేధస్సు ప్రాముఖ్యతను వివరించారు. నిరంతరం కొత్త విషయాలను నేర్చుకునే వారికే కార్పొరేట్ రంగంలో మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు.

### గ్రామీణ విద్యార్థులకు వరం - లచ్చారావు

వికాస ఫౌండేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ లచ్చారావు మాట్లాడుతూ.. వికాస తరఫున ఎంతోమంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నామని, శ్రీ రామకృష్ణ కళాశాల యాజమాన్యం చూపిస్తున్న చొరవ వల్లనే ఇక్కడ భారీ స్థాయిలో నియామకాలు జరపగలుగుతున్నామని పేర్కొన్నారు.

### పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా విద్య

**- డి. కాంతారావు ఞ విశ్వనాథ రెడ్డి**

ఎల్ అండ్ టి సీనియర్ ఇన్‌స్ట్రక్టర్ డి. కాంతారావు , సెంట్రల్ గుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీ విశ్వనాథ రెడ్డి ప్రసంగిస్తూ.. సంస్థలో చేరిన తర్వాత క్రమశిక్షణ, అంకితభావం ఎంత ముఖ్యమో వివరించారు. కేవలం అకడమిక్ మార్కులే కాకుండా, ప్రాక్టికల్ నాలెడ్జ్ ఉన్నవారికే పరిశ్రమలో ఎర్ర తివాచీ స్వాగతం పలుకుతుందన్నారు.

### విద్యార్థులకు నిరంతర శిక్షణ

**- డైరెక్టర్ జి. హేమంత్ రెడ్డి - డీన్ ప్రగతి:**

కళాశాల డైరెక్టర్ జి. హేమంత్ రెడ్డి , డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ ఏ.ఎస్. ప్రగతి మాట్లాడుతూ.. క్యాంపస్ రిక్రూట్‌మెంట్ శిక్షణ తరగతులను మొదటి సంవత్సరం నుంచే నిర్వహిస్తున్నామని, అందుకే విద్యార్థులు ఇంటర్వ్యూలను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోగలుగుతున్నారని తెలిపారు. ఈ మెగా డ్రైవ్ నిర్వాహకులు మరియు ప్లేస్‌మెంట్ ఆఫీసర్ శ్రీ ఎం. ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఇంత మంచి అవకాశాన్ని కల్పించాలని దృక్పథం తో దాదాపూ 16 కంపెనీలను ఆహ్వానించిన కళాశాల చైర్మన్ ప్రొఫెసర్ జి .రామకృష్ణ రెడ్డి కి, తమ ఆహ్వానాన్ని మన్నించి కళాశాలకు విచ్చేసిన ఎంపీ గారికి, వివిధ కంపెనీల సీఈఓలకు, ప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ డ్రైవ్‌లో ఎంపికైన విద్యార్థులకు ఆఫర్ లెటర్లు అందించడం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో కళాశాల కంపెనీ ప్రతినిధులతో పాటు వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు మరియు భారీ సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



---

# టిక్కెట్ ధరల పెంపు మెమోలు ఎలా ఇస్తారు

### ధరలు పెంచబోమని మంత్రే స్వయంగా చెప్పారుగా

### ప్రభుత్వ తీరుపై మండిపడ్డ తెలంగాణ హైకోర్టు



హైదరాబాద్,**జనవరి 09ఆంధ్ర ప్రగతి** కొత్త సినిమాల టికెట్ ధరలను పెంచుకునేందుకు అవకాశం కల్పిస్తూ మెమోలు జారీ చేయడంపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తెలివిగా మెమోలు ఎందుకు ఇస్తున్నారని ప్రభుత్వ న్యాయవాదిని ప్రశ్నించింది. టికెట్ ధరలు పెంచబోమని సంబంధిత మంత్రే స్వయంగా ప్రకటించారని, అయినా కూడా ధరల పెంపునకు మెమోలు ఎందుకు ఇస్తున్నారంటూ అసహనం వ్యక్తం చేసింది. ఎన్నిసార్లు చెప్పినా ఎందుకు మీ ఆలోచన మారడం లేదంటూ మండిపడింది. మెమో ఇచ్చే అధికారికి నిబంధనలు తెలియవా? అంటూ తీవ్ర స్వరంతో ప్రశ్నించింది. సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'ది రాజాసాబ్' సినిమా టికెట్ ధరలు పెంచుకునేందుకు అధికారులు అనుమతించిన సంగతి తెలిసిందే. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం నుంచి ఈ నెల 11 వరకు సింగిల్ స్క్రీన్‌లలో రూ.105, మల్టీప్లెక్స్‌ల్లో రూ.132 పెంపునకు అనుమతి ఇచ్చింది. 12 నుంచి 18వ తేదీ వరకు సింగిల్ స్క్రీన్‌లలో రూ.62, మల్టీప్లెక్స్‌ల్లో రూ.89 పెంపునకు అనుమతి ఇచ్చింది. టికెట్ లాభాల్లో 20 శాతం ఫిలిం ఫెడరేషన్‌కు ఇవ్వాలని ఆదేశాలిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో 'రాజాసాబ్' టికెట్ ధరల పెంపును సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. నిబంధనలకు విరుద్ధంగా టికెట్ల ధరల పెంపునకు అనుమతిస్తున్నారని న్యాయవాది విజయ్ గోపాల్ పిటిషన్‌లో పేర్కొన్నారు. హోంశాఖ కార్యదర్శికి మెమో జారీ చేసే అధికారం లేదని ఆయన కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. జిల్లా స్థాయిలో కలెక్టర్లు, హైదరాబాద్‌లో సీపీ మాత్రమే టికెట్ల ధరల పెంపు, బెనిఫిట్ షోలకు అనుమతి ఇవ్వాల్సి ఉంటుందని కోర్టుకు వివరించారు.

# ప్రశాంతంగా ముగిసిన ఉత్తర ద్వార దర్శనం

### దర్శనాలపై దాదాపు 93 శాతం భక్తులు సంతృప్తి - -స్వామివారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య 7.83 లక్షలు

### శ్రీవారి హుండీ ఆదాయం రూ.41.14 కోట్లు రాక -మీడియా సమావేశంలో టిటిడి చైర్మన్, ఇవోలు వెల్లడి



తిరుమల,**జనవరి 09ఆంధ్ర ప్రగతి**వైకుంఠ ఏకాదశి సందర్భంగా డిసెంబర్ 30 నుండి జనవరి 8వ తేది వరకు నిర్వహించిన వైకుంఠ ద్వార దర్శనాలకు టీటీడీ చేసిన ఏర్పాట్లపై భక్తులు విశేష సంతృప్తి వ్యక్తం చేసినట్లు టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు తెలియజేశారు. వైకుంఠ ద్వార దర్శనాలు విజయవంతం కావడంతో ఆయన టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరిలతో కలిసి తిరుమలలోని అన్నమయ్య భవన్ లో శుక్రవారం ఉదయం మీడియా సమావేశం నిర్వహించారు.

స్వామివారి దర్శనానికి విచ్చేసిన భక్తులందరూ కూడా టీటీడీ కల్పించిన సౌకర్యాలు అద్భుతంగా ఉన్నాయని ఆనందం వ్యక్తం చేశారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ఏఐ సహకారంతో ఎప్పటికప్పుడు భక్తుల రద్దీని పర్యవేక్షిస్తూ గతంలో ఎన్నడూ లేని విధంగా టోకెన్ లేని భక్తులకు కూడా వేగవంతంగా దర్శనం చేయించామని అన్నారు. వైకుంఠ ద్వార దర్శనాలపై దాదాపు 93 శాతం మంది భక్తులు సంతృప్తి చెందారని అన్నారు. ఈ పది రోజుల్లో స్వామివారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య 7.83 లక్షలు అన్నారు. గత వైకుంఠ ద్వార దర్శనాల్లో 6.83 లక్షల మంది దర్శించుకోగా ఈ ఏడాది లక్ష మంది భక్తులకు అదనంగా దర్శనాలు జరిగాయన్నారు. జనవరి 2వ తేది శుక్రవారం రోజు అయినప్పటికీ రికార్డు స్థాయిలో 83 వేల మంది భక్తులకు దర్శనం కల్పించామని అన్నారు. జనవరి 3వ తేది శనివారం అత్యధికంగా దాదాపు 89 వేల మందికి దర్శనం జరిగిందన్నారు. అందుబాటులో ఉన్న 182 గంటల దర్శన సమయంలో 164 గంటల సమయం సామాన్య భక్తులకు కేటాయించడంతో సామాన్య భక్తుల్లో ఆనందం కలిగిందన్నారు. పది రోజుల్లో శ్రీవారి హుండీ ఆదాయం రూ.41.14 కోట్లుగా తెలిపారు. భక్తులకు విక్రయించిన శ్రీవారి లడ్డూల సంఖ్య 44 లక్షలు అన్నారు. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది 10 లక్షల లడ్డూలు అదనంగా విక్రయం జరిగిందన్నారు. దాదాపు 2400 మంది పోలీసులు, 1150 మంది విజిలెన్స్ సిబ్బందితో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని అన్నారు. వివిధ విభాగాల సమన్వయంతో ఇంటిగ్రేటెడ్ ఏఐ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ఎప్పటికప్పుడు భక్తుల రద్దీని ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తూ భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నట్లు వారు వెల్లడించారు. తిరుమల, తిరుపతిలో 5 భాషల్లో భక్తులకు అర్థమయ్యేలా 400 ప్రచార బోర్డులు ఏర్పాటు. రేడియో బ్రాడ్ కాస్టింగ్ ద్వారా 5 భాషల్లో వైకుంఠ ద్వార దర్శనాలపై అవగాహన కల్పించామని అన్నారు. తిరుమలలో విద్యుత్ దీపాలంకరణపై భక్తులు విశేష ప్రశంస వచ్చిందన్నారు. తిరుమలలో టీటీడీ విజిలెన్స్, పోలీసులు సమన్వయంతో భక్తులకు ఇబ్బంది కలగకుండా బ్యారికేడ్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తిరుమలలో నీటి కొరత లేకుండా నిరంతరాయం భక్తులకు నీటి సరఫరా చేశామని అన్నారు. ఈ పది రోజుల్లో 33 లక్షల మంది భక్తులకు అన్న ప్రసాదాల పంపిణీ జరిగిందన్నారు. గత వైకుంఠ ద్వార దర్శనాలతో పోల్చితే ఈసారి 9.29 లక్షల మంది భక్తులకు అదనంగా అన్న ప్రసాదాలు పంపిణీ చేశామని అన్నారు. తొలి మూడు రోజులు టోకెన్ కలిగిన భక్తులకే దర్శనం కల్పించడం జరిగిందన్నారు. దర్శన క్యూ లైన్లు, రోడ్లు, మరుగుదొడ్ల వద్ద భక్తులకు ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా పారిశుద్ధ్య సిబ్బంది ద్వారా ఎప్పటికప్పుడు చెత్తను తొలగిస్తూ పరిశుభ్రతకు పెద్దపీట వేశామన్నారు. ఈ సందర్భంగా టీటీడీ యంత్రాంగంతో సమన్వయం చేసుకుని చక్కటి సేవలు అందించిన పోలీస్ యంత్రాంగం, జిల్లా యంత్రాంగం, ఏపీఎస్ ఆర్టీసీ, శ్రీవారి సేవకులు, ఇతర విభాగాలు, మీడియా ప్రతినిధులకు చైర్మన్ ధన్యవాదాలు తెలియజేశారు.టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ మాట్లాడుతూ తిరుమలలోనే కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న టీటీడీ అనుబంధ ఆలయాల్లో కూడా గతంలో కంటే అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారని చెప్పారు. గత వైకుంఠ ఏకాదశి రోజు 7 లక్షలకు పైగా దర్శించుకుంటే ఈసారి 12 లక్షలకు పైగా భక్తులు దర్శించుకున్నారని తెలిపారు. టీటీడీ భక్తుల కోసం చేస్తున్న సౌకర్యాలను చూసి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేస్తున్నారని చెప్పారు. అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి మాట్లాడుతూ వివిధ విభాగాల మధ్య సమన్వయంతో సమయాన్ని సరైన విధంగా వినియోగించుకోవడంతో అనుకున్న దానికన్నా అదనంగా దర్శన సమయం సమకూరడంతో మరింత మంది భక్తులకు సౌకర్యవంతంగా దర్శనం చేయించేందుకు అవకాశం ఏర్పడిందని తెలిపారు.

ఈ సమావేశంలో టీటీడీ బోర్డు సభ్యులు నరేష్, శాంతారామ్, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, సీవీఎస్వో మురళీకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఫర్వాలేదనిపించుకున్న రాజా సాబ్

బాహుబలి తర్వాత లార్జర్ దేన్ లైఫ్ తరహా సినిమాలతోనే ప్రయాణం చేస్తున్నారు ప్రభాస్. ఫ్యాన్స్ ఆయనను వింటేజ్ డార్లింగ్ లుక్ లో చూసి చాలా కాలమైయింది. ఆ లోటుని భర్తీ చేసే సినిమా 'రాజాసాబ్' అని స్వయంగా డైరెక్టర్ మారుతి చెప్పడం, కెరీర్ లో తొలిసారి ప్రభాస్ ఒక హారర్ ఫాంటసీ స్జబెక్ట్ ని ఎంచుకోవడం, ప్రచార చిత్రాలు ఆసక్తిని రేపడం, సంక్రాంతి రేసులో తొలి సినిమాగా రావడంతో మంచి హైప్, అంచనాలు ఏర్పడాయి. రాజు అలియాస్ రాజాసాబ్ (ప్రభాస్)కు అమ్మానాన్న అన్నీ నాయనమ్మ గంగాదేవి(జరీనా వహాబ్)నే. గంగాదేవికి ఆల్జీమర్స్. ప్రతి విషయాన్ని మర్చిపోతుంటుంది. కాకపోతే ఎప్పుడో తనని విడిచిపెట్టి వెళ్ళిపోయిన భర్త కనకరాజు (సంజయ్‌దత్)ని మాత్రం గుర్తుపెట్టుకుంటుంది. తాత కనకారాజు కోసం వెదుకుతున్న రాజుకు కొన్ని సంచలన నిజాలు తెలుస్తాయి. నర్సాపూర్ అడవిలోని ఓ రాజమహల్ వున్నాడనే సంగతి తెలుసుకుంటాడు. ఆ రాజమహల్ అడుగుపెట్టిన రాజుకి ఎలాంటి అనుభవాలు ఎదురయ్యాయి ? కనకరాజు గురించి ఎలాంటి నిజాలు తెలుసుకున్నాడు? అసలు గంగాదేవి గతం ఏమిటి? కనకరాజు గంగాదేవిని ఎందుకు వదిలివెళ్ళిపోయాడు? తన లక్ష్యం ఏమిటి? నాయనమ్మ కోసం రాజు ఎలాంటి పోరాటం చేశాడనేది మిగతా కథ. నాయనమ్మకి జ రి గి న




అన్యాయానికి ప్రతీకారం తీర్చుకున్న మనవడి కథ ఇది. ఒక హారర్ ఫాంటసీ సరిపడే ముడిసరకు ఈ కథలో పుష్కలంగా వుంది. హిప్నాటిజంతో పాటు తాంత్రిక విద్యలు తెలిసిన విలన్ ని తన మనోబలంతో హీరో ఎలా జయించాడనే పాయింట్ బలమైనదే. కాకపోతే ఇందులో సంఘర్షణ, సన్నివేశాలు, కథనం అల్లిన తీరు ఇంకా ప్రభావవంతంగా ఉండాల్సింది. సత్య పాత్ర రాజ్ మహాల్ ప్రవేశం, అక్కడ జరిగిరే సన్నివేశాలు థ్రిల్లింగ్ ఫీలింగ్ కలిగిస్తూ సినిమా కథ మొదలౌతుంది. ఈ సీక్వెన్స్ రాజాసాబ్ పై అంచనాలు పెంచుతుంది. రాజు పాత్రలో ప్రభాస్ ఎంట్రీ ఆ తర్వాత వచ్చే పాట వింటేజ్ డార్లింగ్ ని గుర్తు చేస్తుంది. తర్వాత తాతని వెదికే క్రమంలో వచ్చే సన్నివేశాలు సాదాసీదాగా సాగుతాయి. హీరోయిన్స్ ట్రాక్స్ సరిగ్గా వర్క్ అవుట్ కాలేదు. రాజు పాత్ర మహాల్ లోకి ఎంట్రీ ఇస్తేనే అసలు కథ మొదలౌతుంది. కాకపోతే ఆ ఘట్టానికి రావడానికి ఇంటర్వెల్ వరకూ ఎదురుచూసేలా చేశారు. దీంతో అప్పటివరకూ సాగదీసిన ఫీలింగ్ కలుగుతుంది. కనకరాజు పాత్రలో సంజయ్ దత్ చేసే హిప్నటిజం ఆడియన్స్ కి ఇంకా బలంగా రిజిస్టర్ చేయాల్సింది. బోమన్ ఇరానీ పాత్ర వచ్చే వరకూ చాలా విషయాలు కన్ఫ్యుజన్ లోనే వుంటాయి. అలాగే ఆ మహాల్ ప్రవేశించిన పాత్రలు పెద్ద సవాళ్లు ఎదురుకావు. కామెడీ కూడా సరిగ్గా వర్క్ అవుట్ కాలేదు. దీంతో ఆడియన్స్ కి జరుగుతున్న సంఘటనలపై ఆసక్తి తగ్గుతుంది. కాకపోతే ప్రీక్లైమాక్స్ క్లైమాక్స్ సినిమాకి ఆయువు పట్టుగా నిలిచాయి. ఆ సన్నివేశాలు ఉత్కంఠభరితంగా తీర్చిదిద్దారు. ప్రభాస్ మళ్ళీ వింటేజ్ లుక్ లో చూడటం ఆయన ఫ్యాన్స్ ని ఖుషి చేస్తుంది. చాలా కాలం తర్వాత ఫన్ బాడీ లాంగ్వేజ్,, ÷ట్స్, డ్యాన్సులు.. ఇలా కలర్ ఫుల్ అవతార్ లో కనిపించారు. సంజయ్ దత్ పర్సనాలిటీ ఆ క్యారెక్టర్ కి ప్లస్ అయ్యింది. కాకపోతే ఆ పాత్రని ఇంకా బలంగా రాయాల్సింది. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ తెరపై అందంగా కనిపించారు. అయితే ఆ పాత్రలు కథలో మిళితం కాలేదు. జరీనా వాహెబ్ తన అనుభవం చూపించారు. వీటీవీ గణెళిష్, సప్తగిరి, ప్రభాస్ శ్రీను, సత్య.. అక్కడక్కడ నవ్వించారు.



# డ్రగ్స్ కేసులో నవదీప్ కు భారీ ఊరట

డ్రగ్స్ కేసులో నటుడు నవదీప్‌కు పెద్ద ఊరట లభించింది. ఆయనపై నమోదైన డ్రగ్స్ కేసును తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. గుడిమల్కాపూర్‌లో నమోదైన ఈ కేసులో నవదీప్ వద్ద ఎలాంటి మత్తుపదార్థాలు దొరకలేదన్న అంశాన్ని కోర్టు స్పష్టంగా గుర్తించింది.

నవదీప్ తరఫున వాదనలు వినిపించిన అడ్వొకేట్ వెంకట సిద్ధార్థ్ మాట్లాడుతూ.. ఈ కేసులో నవదీప్ పేరు కేవలం ఎఫ్ఐఆర్ లో మాత్రమే ఉందని, సంఘటన జరిగిన ప్రదేశంలో ఆయన వద్ద డ్రగ్స్ ఏవీ లభించలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. స్పాట్‌లో స్వాధీనం చేసుకున్న వస్తువుల్లో నవదీప్‌కు సంబంధించిన ఆధారాలు లేవని వివరించారు.

ఈ వాదనలతో ఏకీభవించిన హైకోర్టు.. సరైన ఆధారాలు లేకుండా కేసు కొనసాగించడం సరికాదని పేర్కొంది. నవదీప్ వద్ద డ్రగ్స్ లభించనందున, ఆయనపై నమోదైన కేసును కొట్టివేస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ తీర్పుతో నవదీప్‌కు చట్టపరంగా పెద్ద ఊరట లభించినట్టయింది.

# చీరకట్టులో యాక్షన్..
## సమంత కొత్త సినిమా టీజర్



కొంతకాలంగా వెండితెరకు దూరంగా ఉన్న స్టార్ హీరోయిన్ సమంత, పూర్తిస్థాయి యాక్షన్ అవతార్‌తో గ్రాండ్ రీఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'మా ఇంటి బంగారం' టీజర్‌ను చిత్ర యూనిట్ శుక్రవారం విడుదల చేసింది. ఈ టీజర్‌లో సమంత మునుపెన్నడూ చూడని రగ్డ్, సీరియస్ లుక్‌తో, చీరకట్టులో బస్సులో ఫైట్ చేస్తున్న సన్నివేశాలు ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తున్నాయి. దీంతో ఈ వీడియో సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతూ సినిమాపై అంచనాలను భారీగా పెంచుతోంది.'మా ఇంటి బంగారం' అనే టైటిల్ వినడానికి సున్నితమైన కుటుంబ కథ చిత్రంగా అనిపించినా, టీజర్ చూశాక ఇది పక్కా యాక్షన్ థ్రిల్లర్ అని స్పష్టమవుతోంది. సమంత కెరీర్‌లో ఇది ఒక భిన్నమైన ప్రయత్నంగా నిలవనుంది. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన సూపర్ హిట్ చిత్రం 'ఓ బేబీ' తర్వాత దర్శకురాలు నందిని రెడ్డితో సమంత చేస్తున్న రెండో సినిమా కావడంతో సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ఈ చిత్రానికి సమంత సహ నిర్మాతగా వ్యవహరించడం మరో విశేషం.త్రలాల మూవీంగ్ పిక్చర్స్ బ్యానర్‌పై రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరుతో కలిసి సమంత ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'కాంతారా' ఫేమ్ గుల్షన్ దేవయ్య, కన్నడ నటుడు దిగంత్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు సంతోశ్ నారాయణన్ సంగీతం అందిస్తుండగా, ఆయన నేపథ్య సంగీతం యాక్షన్ సన్నివేశాలకు మరింత బలాన్ని చేకూర్చనుంది.ఇప్పటికే 'ది ఫ్యామిలీ మ్యాన్ 2', 'సిటాడెల్ల వంటి వెబ్ సిరీస్‌లలో యాక్షన్ పాత్రలతో మెప్పించిన సమంత, ఈ సినిమాలో డూప్ సహాయం లేకుండా సొంతంగా స్టంట్స్ చేస్తున్నట్లు సమాచారం. సుదీర్ఘ విరామం తర్వాత పూర్తిస్థాయి కథనాయిక ప్రాధాన్యమున్న చిత్రంతో సమంత వస్తుండటంతో, అభిమానులు ఈ సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# జన నాయగన్ కు ఊరట
## సెన్సార్ ఇవ్వాలని మద్రాస్ హైకోర్టు ఆదేశం



విజయ్ కథానాయకుడిగా నటించిన 'జన నాయగన్' సినిమాకు ఊరట లభించింది. ఈ సినిమాకు యూ/ఏ సర్టిఫికెట్ ఇవ్వాలని సెన్సార్ బోర్డుకు మద్రాసు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు శుక్రవారం తీర్పు వెలువరించింది. గత డిసెంబరులో సెన్సార్ కోసం జన నాయగన్ సినిమాను పంపగా అభ్యంతరకర మైన సన్నివేశాలు తొలగించాలని, కొన్ని సంభాషణలు మ్యూట్ చేయాలని సూచించినట్లు సమాచారం. ఆ మేరకు మార్పులు చేసిన నిర్మాణ సంస్థ మళ్లీ సెన్సార్‌కు పంపగా బోర్డు నుంచి స్పందన రాలేదు. ఈ నేపథ్యంలో కేవీఎన్ ప్రొడక్షన్ తరపున మద్రాసు హైకోర్టులో అత్యవసర పిటిషన్ దాఖలైంది. తొలుత యూ/ఏ సర్టిఫికేషన్‌కు సిఫార్సు చేసిన సెన్సార్ బోర్డు.. ఆ తర్వాత సినిమాను రివ్యూ కమిటీకి పంపిందని నిర్మాణ సంస్థ కోర్టు దృష్టికి తీసుకెళ్లింది. దీనిపై వాదనలు విన్న హైకోర్టు బుధవారం తీర్పును రిజర్వ్ చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో జనవరి 9న విడుదల కావాల్సిన ఈ సినిమా వాయిదా పడింది. తాజాగా ఈ అంశంపై హైకోర్టు సింగిల్ జడ్జి శుక్రవారం తీర్పు వెలువరించారు. సినిమాకు సర్టిఫికెట్ ఇచ్చిన తర్వాత మళ్లీ రివ్యూ కమిటీకి పంపాల్సిన అవసరం ఏంటని న్యాయమూర్తి ప్రశ్నించారు. ముందుగా ఇస్తామన్న యూ/ఏ సర్టిఫికెట్ తక్షణమే ఇవ్వాలంటూ ఆదేశాలు జారీ చేశారు. కాగా.. సింగిల్ జడ్జి తీర్పుపై సెన్సార్ బోర్డు అప్పీల్ చేసింది. మద్రాసు హైకోర్టు చీఫ్ జస్టిస్ ధర్మాసనం ముందు అత్యవసర విచారణ కోసం రిట్ పిటిషన్ దాఖలు చేసింది. అయితే, తాజా తీర్పుతో 'జననాయగన్' విడుదలకు లైన్ క్లియర్ అయ్యింది. ఈ క్రమంలోనే సంక్రాంతి కానుకగా జనవరి 14న విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోన్నట్లు

# ఆస్కార్ రేసులో ఇండియన్ ఫిలిమ్స్
## ముందున్న కాంతారా, మహావతార్ నరసింహ





సినీ ఇండస్ట్రీలో ప్రతిష్టాత్మకంగా భావించే 98వ ఆస్కార్ అవార్డుల సందడి మొదలైంది. అంతర్జాతీయ వేదికపై అప్పుడే మొదలైంది. తాజాగా అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ విడుదల చేసిన 'రిమైండర్ లిస్ట్'లో భారత్ నుండి ఏకంగా నాలుగు చిత్రాలు చోటు దక్కించుకుని సంచలనం సృష్టించాయి. మొత్తం 201 చిత్రాలతో కూడిన ఈ జాబితాలో నిలిచిన సినిమాలు 'ఉత్తమ చిత్రం' కేటగిరీలో పోటీ పడేందుకు అర్హత సాధించాయి. ఇందులో రిషబ్ శెట్టి దర్శకత్వంలో వచ్చిన కన్నడ బ్లాక్ బస్టర్ 'కాంతార: ఎ లెజెండ్ చాప్టర్ 1' గ్లోబల్ స్థాయిలో తన పట్టు నిలుపుకోగా, అనుపమ్ ఖేర్ దర్శకత్వం వహించిన హిందీ చిత్రం 'తన్వి ది గ్రేట్' ఆస్కార్ రేసులో నిలిచి అందరినీ షాక్‌కి గురిచేసింది. ఇక వీటితో పాటు భారతీయ పురాణ నేపథ్యంలో వచ్చిన బహుభాషా యానిమేషన్ చిత్రం 'మహావతార్ నరసింహ', నూతన దర్శకుడు అభిషన్ జీవింత్ తెరకెక్కించిన తమిళ చిత్రం 'టూరిస్ట్ ఫ్యామిలీ' కూడా ఈ అర్హత జాబితాలో చోటు దక్కించుకున్నాయి. రాధికా ఆప్టే నటించిన 'సిస్టర్ మిడ్‌నైట్' సైతం ఈ పోటీలో ఉండటం విశేషం. మరోవైపు భారత్ నుంచి అధికారికంగా పంపబడిన నీరజ్ ఘైవాన్ చిత్రం 'హోమ్‌బౌండ్' ఇప్పటికే 'ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్' కేటగిరీలో టాప్-15 షార్ట్‌లిస్ట్‌లో నిలిచి భారీ ఆశలు రేకెత్తిస్తోంది.

ఆస్కార్ నిబంధనల ప్రకారం.. ఈ చిత్రాలన్నీ 2025లో అమెరికాలోని ప్రధాన మెట్రోపాలిటన్ ఏరియాల్లో కనీసం ఏడు రోజులు థియేటర్లలో ప్రదర్శితమై ఉండటంతో పాటు ఆస్కార్ అకాడమీ సూచించిన 'ఇన్‌క్లూజన్ స్టాండర్డ్స్' ప్రమాణాలను విజయవంతంగా పూర్తిచేశాయి. అయితే ఈ జాబితాలో ఉన్నంత మాత్రాన నామినేషన్ దక్కినట్లు కాదని, అకాడమీ సభ్యుల రహస్య ఓటింగ్ పక్రియ తర్వాతే అసలు విజేతలు ఎవరో తెలుస్తుందని గుర్తుంచుకోవాలని సినీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు ఈ ఉత్కంఠకు తెరదించుతూ 2026 జనవరి 22న తుది నామినేషన్ల జాబితాను అకాడమీ ప్రకటించనుంది. ఇక ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియులు ఎంతగానో ఎదురుచూసే 98వ ఆస్కార్ అవార్డుల ప్రధానోత్సవ వేడుక మార్చి 15న లాస్ ఏంజెల్స్‌లోని డాల్బీ థియేటర్లో వైభవంగా జరగనుంది.

# శివకార్తికేయన్ పరాశక్తి నేడు విడుదల

శివకార్తికేయన్ హీరోగా, సుధా కొంగర దర్శకత్వంలో రూపుదిద్దుకున్న భారీ బడ్జెట్ చిత్రం 'పరాశక్తి' ఎట్టకేలకు సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు తాజాగా సర్టిఫికేట్‌ను జారీ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ సినిమా 1960ల నాటి హిందీ వ్యతిరేక ఉద్యమ నేపథ్యం ఉన్నందున, తొలుత సెన్సార్ బోర్డు 23 కట్స్ సూచించినప్పటికీ, రివైజింగ్ కమిటీ పరిశీలన తర్వాత కొన్ని మార్పులతో క్లియరెన్స్ లభించింది. సుమారు 162 నిమిషాల నిడివి ఉన్న ఈ పీరియాడిక్ పొలిటికల్ డ్రామాలో శివకార్తికేయన్ కాలేజీ విద్యార్థిగా కనిపించనున్నారు. ఈ సినిమా తమిళ వెర్షన్ సంక్రాంతి కానుకగా జనవరి 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. అయితే తెలుగులో సంక్రాంతి సినిమాల రద్దీ మరియు థియేటర్ల లభ్యత తక్కువగా ఉన్న కారణంగా, తెలుగు వెర్షన్ విడుదలను జనవరి 23కి వాయిదా వేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. శ్రీలీల హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో జయం రవి, అథర్వ మురళి కీలక పాత్రలు పోషించారు. సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్‌కు ఇది 100వ సినిమా కావడం విశేషం.

